# యవనవ్వనం

పన్నెండు కొట్టారు. ఎదురుగా సముద్రం వంక చూస్తో చేతులో పేక కింద పడేశాడు లింగరాజు. ఆ రాత్రి ఆ క్లబ్బు వరండాలో, పదిహేను రూపాయలు వోడాడు ఎదురుగా కూచున్న ముగ్గురు మిత్రులకీ.

"జాతకం ఏం బాగా లేదు. అన్నీ నష్టాలే:" అన్నాడు చిరునవ్వుతో, రోషమూ, చిరాకూ కలిపి.

అవునని, ఇసికని అలికింది ఓ పెద్ద అల.

"పదిహేను రూపాయలంటే చాలా కష్టమే లింగరాజుకి. ఏ మూలో పాపం ఓ నెల మామూలు కర్చు తగ్గించుకుంటాడు. ఇతనికేం? ఇట్లానే వోడుతో వుంటాడు. ఆ భార్యది కష్టమంతా. కాని ఆ మాత్రం చీట్లపేక సరదా లేకుండా ఎట్లా బతుకుతాడు?" అని ఆలోచిస్తున్నాడు పక్కన కూచున్న శానిటరీ ఇన్‌స్పెక్టరు-లింగరాజువి ఆరు రూపాయలు గెలుచుకున్న పెద్దమనిషి.

లింగరాజు క్లబ్బులో ఉచితమైన మెంబరు. అందరికీ తెలుసు—అతని నిరంతర దారిద్ర్యమూ, అతని సహజమైన స్నేహయోగ్యతా.

"పోనీ నేను గెలుచుకున్న నాలుగు రూపాయలూ తిరిగి అతనికి ఇచ్చివెయ్యనా?" అనుకుంటున్నాడు ఎదురుగా కూచున్న తాసిల్దారు.

మానవ జీవితంమీది రూపాయల మహిమని అలకించి నవ్వుతోంది రత్నగర్భ.

కాని అందరికీ తెలుసు లోలోపల, చీట్లపేకలోనే కాదు, జీవితంలో కూడా జాలీ ఉదారత్వం అల్లాంటి శక్తుల్ని గట్టిగా రానిస్తే, అసలు సరదాయే పోయి జీవితంలో నిస్పృహ కలుగుతుందని. జీవితమనే ఆటలో లాభనష్టాలమీది దృష్టి సన్నగిల కూడదు, సుఖపడాలంటే.

"మీ కుర్రాడిగొడవ యేమన్నా తేలిందా?" అని అడిగాడు లింగరాజుని.

"అబ్బాయి సంగతేమిటి?" అన్నాడు పొరుగూరునుంచి వొచ్చిన వాళ్ళ సహాధ్యాయుడు, డాక్టరు.

ఎదుటగా సముద్రం ఎలెక్ట్రిక్ దీపాల కింద, తెల్లని నురుగును అక్షతలలాగు చల్లుతోంది ఇసికమీద. ఆ ఎండాకాలపు రాత్రి నీళ్ళమీది చిన్న గాలి ఉచితంగా ఆహ్లాదాన్ని విరబోస్తోంది వాళ్ళ చుట్టూ. కాని ఇంతవరకు వాళ్ళు ఒక్క క్షణమైనా "ఎంత హాయి" అనైనా అనుకోలేదు. క్లబ్బులోనించి ఇళ్ళకి వెళ్ళి, పాత గదుల మూల పాత మంచాలమీద పాత పెళ్ళాల పక్కన పడుకున్నాకా గుర్తుకు రాదు, తమ నంతవరకూ, ఏ గుర్తూ ఆశించకుండా లాలించిన సముద్రపు గాలిలోని అవ్యాజమైన దయ! వియద్ధాలతో పోల్చుకుని కావి సౌఖ్యాన్ని గుర్తించలేరు మానవులు.

"తెలీదా నీకు? ఇతని అబ్బాయి—యూనివర్సిటీ రిసర్చి విద్యార్థి—చాలా తెలివైన వాడు. ఓ సినీమానటిని పెళ్ళి చేసుకుంటానని పట్టుపట్టాడు."

"ఇంకేం సరస్వతిని అతను వరిస్తే లక్ష్మి అతన్నే వరిం

చింది. ఇంతకన్న ఇంకేం కావాలి" అన్నాడు నవ్వుతో డాక్టరు.

"అంతేనా? పరువూ, కులం, వంశం, నీతీ, ఏం ఆలోచించ నక్కర్లేదంటావా?" అన్నాడు లింగరాజు.

"ఆ పట్టింపులన్నీ ఇంకా ఎక్కడ వున్నాయోయ్, వ్యాసాల్లో, మాటల్లో తప్ప. డబ్బు. డబ్బు. డబ్బు. డబ్బుతో సాధించలేనిదీ, డబ్బు తుడిచివెయ్యలేనిదీ ఏ అప్రతిష్ఠా, అధర్మం, పాతకం లేనే లేవు-ఈనాడే కాదు, వేదకాలం నించీ కూడా" అన్నాడు తాసిల్దారు.

"ఆ డబ్బూ లేదోయ్! సినీమానటి అంటే చాలా పిల్లనటి" అన్నాడు లింగరాజు.

"అట్లా చెప్పూ! అదా నీగొడవ?" అని సినికల్‌గా నవ్వాడు డాక్టరు.

"ఏమంటాడు మీ అబ్బాయి?"

"మామూలే. అది లేనిది తాను బతకలేనంటాడు."

"ఆమె లేనిదే నేను బతకలేను" అని లోపల్నించి నిజంగా అనగలిగిన తమ యవ్వనాన్ని ప్రయత్నించి గాని జ్ఞాపకం చేసుకోలేకపోతున్నారు. ఈనాడు గాని, వాళ్ల చచ్చేదాకా ఏనాడు గాని ఆ మాట ఎవరి విషయమై గాని తాము అనమని వాళ్ళకి దృఢంగా తెలుసు. అందుకనే అంత కష్టం వాళ్ళకి. ప్రతి నిమిషం ఎన్నడూ తరగని ఉత్సాహంతో తీరంతో సరసాలాడే సముద్రాన్ని చూస్తో కూడా వాళ్ళు-ఒక కొత్త పిల్లని పట్టుకుని, ఆమెమీద యిష్టాన్ని, జీవితంలో అన్ని విలువలకన్న అధికం చేసుకుని, తలి తండ్రుల్నికూడా వొదులుకోగల బలంతో కోరడం ఎట్లా వుంటుందో—ఆలోచనకి తెచ్చుకోలేరు. కాని ఆ

మాట అన్నా అనకపోయినా, తానూ తత్తుల్యమైన అవస్థలో పడ్డవారే ఓ నాడు. కాని ఈనాడు ఆ అనుభవం వుత్త సిగ్గు, నవ్వు, ఏదో చిన్నతనపుచేష్ట.

"పూర్వం ఇట్లాంటి వ్యవహారాలు సులభంగా తీరిపోయే వోయ్. ఓ గదిలో పెట్టి మెత్తగా తంతే, వొదిలిపొయ్యేది ప్రేమజాడ్యం. ఈనాడు మగపిల్లలకేకాదు, ఆడపిల్లలకీ పుడుతోంది."

"పెద్దవాళ్ళ మెత్తదనమే దీనికంతా కారణం. మా నాన్న ఏం చేశాడనుకున్నావు? గేదె పలుగుతో తన్నాడు, నే నో గొల్ల దాన్ని గదిలోకి తెచ్చుకున్నప్పుడు. ఆనాటినుంచి పాలని చూస్తే భయం నాకు."

"అవును. ఒకప్పుడు మనమూ ఇటాంటి వెర్రిపోకిళ్ళు పోయిన మహానుభావులమే అనుకుంటో ఎట్లా కఠినంగా తన్న గలం, కుర్రవాళ్ళని?"

"మన లింగరాజు చూడు. ఎంత డబ్బు పెట్టాడను కున్నావు ఆ కుర్రవాడి చదువుమీద! ఆ ముండతో తిరిగి చదువు పాడుచేసుకుంటే, డబ్బు పంపనంటే చదువు మానేసి, ఆ పిల్లతో బిచ్చమెత్తుకుని బతుకుతానని రాశాడు ఆ సుపుత్రుడు."

"ఆ పిల్ల చాలా అందమా ఏమిట్రా? చూశావా నువ్వు?"

"ఏం అందం లేదు ఏమీలేదు" అన్నాడు లింగరాజు బిట్టర్‌గా.

"ఐతే?"

"అందమెందుకోయ్! సినిమా తెరమీద చూస్తే చాలు, అన్ని అందాలూ కల్పించుకుంటారు."

"అదేమిటోయ్, ప్రత్యక్షంగా మనిషిని చూస్తో...."

"కాని, నాటకాల కూర్మయ్యని ఎరుగుదువుగా! నెల్లూరులో పెన్న దుబ్బుల్లో ఆతన్ని అనుగ్రహించిన జడ్జీగారి కూతుర్నే మంటావు? చాలా అందమైనది, చదువుకున్నది. నాటకాల మహిమ."

మాటలు ఆపి సముద్రంకేసి చూస్తున్నారు. తమ బుద్ధికి మించిన యీ కామరహస్యాన్ని ఏమన్నా చెప్పగలదేమో ఆ రహస్యనిధి అన్నట్టు.

తాసిల్దారుకి చిన్నతనం జ్ఞాపకం వొస్తోంది.

"చాలా సహజమోయ్. నేను ఓ నిజమైన కథ చెపుతాను వినండి" అంటో సిగరెట్టు వెలిగించాడు.

• • •

"అప్పుడు ఐదోఫారం చదువుతున్నాను. యవ్వనం వొస్తోందని నాకు గాని ఎవరికి గాని గుర్తులేదు. ఇంకా పొట్టి లాగుల్లోనే వున్నాను. అప్పుడప్పుడు క్లాసులో ఆడపిల్లలకేసి చూచినప్పుడు ఆ ఇరుకులాగు పెట్టే ఇబ్బంది కూడా నాకు సరిగా గుర్తురాని రోజులు. పాఠాలూ, ఆటలూ తప్ప ఆ రోజుల్లో సినీమాలా, పాట కచేరీలా, చలం పుస్తకాలా!

"ఆడవాళ్ళ నాటకం కంపెనీ వొచ్చింది మా వూరు. మా నాన్నగారే ఆ వూరికి పెద్దమనిషి కావడంవల్ల ఆ నాటకంమొగ వాళ్ళు వొచ్చి ఆయన్ని ఆశ్రయించారు. మా కుటుంబమంతా టిక్కెట్లు లేకుండానే ప్రతి నాటకానికీ హాజరైనాము.

ఆడవాళ్లే మొగవేషాలుకూడా, ముఖ్యపాత్ర లన్నీనీ.

నాటకాల glamour ఎప్పుడూ పోదనుకుంటాను. ఈ

నాడైనా చూసిన నాటకం, ఎరిగిన వేషాలవాళ్ళయినాసరే, ముందు ఆ దప్పులు, గుంపూ, లైట్లూ, నిరీక్షిస్తో కూచోడం, తెర కదలడం, ఏం చూడబోతున్నామో అనే ఆలోచనలూ-ఆ చిన్నతనంలో ఆ మొదటిరాత్రి ఏమైనానో! లోపల్నించి మంగళహారతి, టెంకాయ కొట్టడం, అవ్యక్తమైన మాటలు, చిన్న నవ్వులు. మనుషులు చీరెకుచ్చెళ్ళతో పరిగెత్తుతున్న చప్పుడు, తెల్లని మోచేతిభాగం తెర సందులోంచి కనిపించడం.

"రెండో రంగంలో, రాజకుమారుడు రంగంమీద ప్రవేశించాడో లేదో, ఈకె తురాయీ, వంపుతీరిన మీసం, చమ్కీకోటూ, లాగూ, కత్తీ—ఆడదని తెలీదుసుమా నాకు. నా హృదయం ఒక్క నిమిషంలో ఆ రాజకుమారుడి దయ్యింది జీవితంలో ఒక్క పెద్ద మెరుపు మెరిసినట్టు. ఇంక ఎన్నడూ ఇంతవరకు నే నట్లా ప్రేమించలేదు. నాటక పాకలు తెలుసుగా నీకు—ఈనాటివీ అట్లానే వున్నాయి. రెండు ఆరిపొయ్యే గాసు లైట్లూ, కింద దుమ్మూ, పైన రేకులూ, మూడు చిరిగిపోయిన తెరలూ-కాని ఆనాటినించి ఆ స్థలమంతా స్వర్గ మయిం దనుకో. నేను ఎదిగాక మైసూరులో దసరా ఉత్సవాలు, కాంగ్రెసు, park fairs-ఎన్నో చూశాను. కాని అట్లాంటి అనుభవం ఎన్నడూ కలగలేదు, మళ్ళీ తరవాత జీవితంలో. మరి మనసుకే కల్పనా గుణం పోతుందో, ఎంత చిత్రమైనా మామూలై పోతుందో, ఎదిగినకొద్దీ!

ఆ మాయ ఒక్కరోజు కాదు. మూడు నెలలు. ఆ రేకులూ, మట్టినేలా పగలు చూసినా సరే గుండె కొట్టుకునేది. అదో స్వర్గం, తెర లోపల్నించే పాడుకుంటో రంగం మీదికి వొచ్చిన ఆ రాజకుమారుణ్ణి చూసిన నిమిషం నించి.

అతను తెరలోపలికి వెళితే దీపా లారిపోయినట్టయింది. మళ్లీ ఎప్పుడు కనబడతాడు? అతను తెర వెనకకి వెళ్ళలేదు. ఎక్కడికో గొప్ప హర్మ్యాల్లోకో, అంతఃపురాల్లోకో వెళ్ళాడనే.

ఇంటికి వెళ్ళిన తరవాత అమ్మా, అక్కయ్యా, నాన్న చాలా సేపు ఆ నాటకం సంగతే మాట్లాడుతున్నారు. వాళ్ళకీ నాలో సగం వెర్రెక్కింది. మర్నాడు నాటకం ప్రారంభం కాక ముందే వెళ్ళాం. ఎవరో వొచ్చి అమ్మనీ వాళ్ళనీ తెరవెనకాలకి రమ్మని పిలిచారు. తెర వెనకాలకి! వాళ్ళల్లోకి! ఆలోచించకుండానే మొగవాళ్ళల్లోంచి చివాలున లేచి నేనూ వాళ్ళ వెంబడి వెళ్ళాను. మంగళహారతికి సిద్ధమౌతున్నారు వాళ్ళు. వాళ్ళమధ్య నారాజకుమారుడు. ఆ పుణ్యస్థలాన్ని తొక్కడానికి అర్హత వుందా అన్నట్లు వెనకగా బెదురుతూ నుంచున్నాను నేను. అమ్మ వాళ్ళతో చనువుగా మాట్లాడుతోంది. వాళ్ళ మెళ్ళల్లో వజ్రహారాల్ని చేత్తో పట్టుకుని చూస్తోంది అమ్మ.

"వుత్త పూసలే" అంది.

వాళ్లు నవ్వారు.

"వజ్రాలమల్లే మెరిశాయి నిన్నరాత్రి" అంది.

"ఆ మనుషులూ వుత్త పూసలే" అన్నారు మానాన్న ఆ రాత్రి. నా కెంత కోపం వచ్చింది!

అదేమిటి అమ్మ ఆ రాజకుమారుల్ని రాచకుమార్తెల్ని అంత దగ్గిరిగా తాకుతుంది, అంత చనువుగా నవ్వుతుంది? ఎన్నటికన్నా నా కా అదృష్టం కలుగుతుందా?

కొంతసేపటికి రాజకుమార్తె నన్ను చూసి "మీ అబ్బాయా?" అంది.

నేను కరిగి నీరైనాను. నన్ను! నన్ను ప్రత్యేకించి పలికింది. శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై నుంచున్నా అట్లా అవుతానా?

"రా నాయనా దగ్గిరికి రా" అని రాజకుమార్తె. నే నేమైనాను? దగ్గిరికి వెళ్ళాలని ఒకటే వుబలాటం. కాని సిగ్గు, గౌరవం, ఇంకేమేమిటో! కదల్లేను.

తెరలోనించి వెలుపలి దీపాల కాంతి, వాళ్ళ రంగు మొహాలమీద, ఆ పెదిమల ఎరుపు, చంపల తళతళ, ఆ చీరెల కింద మిస్టరీ! ఎన్నటికన్నా జన్మలో ఏ అందాలు చూసినా, మళ్ళీ మనసు అట్లా అవుతుందా! స్వర్గంలో అప్సరసల్ని చూసినా! నా చిన్ననాటి కళ్ళ కొత్త యవ్వనపు దివ్యదృష్టి! మళ్ళీ ఏ దేవతలో కటాక్షిస్తేనే తప్ప!

మా అక్క రాజకుమారుడి మీసాల నల్లరంగును తాకి నవ్వుతోంది. పరాయి యువకుణ్ణి!

"ఎంత బావుందో మీ చీరె? ఎంతకి తీశారు?" అన్నాడు రాజకుమారుడు.

ఎక్కడో మనసులో ఆ మాటలు, నా ఊహా కల్పనా అందాలకి సరిపడక గొడవ చేస్తున్నాయి. కాని అంకురించే యవ్వన కాంతులకి గొప్ప ఆధారం దొరికింది. వాటిని ఆర్పగల శక్తి యీ ముసలి ప్రపంచానికి లేదు.

ఒక్క కాలానికి తప్ప!

ఇంటికి వెళ్ళి పడుకుంటే అనేక కలలు. చెవుల్లో అవే పాటలు, కళ్ళముందు అవే రూపాలు.

సాయంత్రం తక్కిన పిల్లలతో కలిసి ఆ నాటకాలు మళ్ళీ, ఎంత వల్లించినా బడి పాఠాలు వొప్పచెప్పలేని నాకు ఆ నాటక

మంతా కరంతా వొచ్చేసింది. వెదురు బద్దల కత్తులుగా, ఇటిక పొడుము రంగుగా, దూకి ఎగిరి, శత్రువులతో యుద్ధాలు చేసి, రాజకుమార్తెను రక్షించేవాణ్ణి.

మా ప్రేక్షకులు మా అక్కయ్య వొక్కతే, మాకు సలహా లిస్తో, పోర్షను అందిస్తో, మెచ్చుకుంటో రెండు రోజులు చూసి, మూడోరోజున అమ్మకి ఫిర్యాదు చేసింది, సాయంత్రాలు చదవ కుండా నాటకాలు ఆడుతున్నానని. ఇదివరకుమాత్రం చదివానా సాయంత్రాలు ఆడుకున్నాను గాని! ఆ ఫిర్యాదు విని సంతోషించి మా అమ్మ కూడా మా నాటకాలకి హాజరవడం ప్రారంభించింది.

అమ్మా వాళ్ళు అసలు నాటకాలకి వొచ్చినా రాకపోయినా ఎవరో ఓ బంధువులతో ఎట్లాగో వోలాగు ప్రతి నాటకానికీ హాజ రైనాను. రోజు విడిచి రోజు నాటకం. వాళ్ళకి నాలుగయిదు నాట కాలే తెలుసు. అవే తిరిగి తిరిగి చూపిస్తున్నారు. అన్నీ కంఠో పాఠమైనాయి నాకు. వీలైనప్పుడల్లా ఎవరితో వొకరితో నాటకం ముందే లోపలికి వెళ్లి వాళ్ళను చూసి వొస్తో వుంటాను. మాటల్లో కాకపోయినా, నేను వాళ్లకి పరిచయం. సాయంత్రం మా నాట కాలు, రాత్రి నిజం నాటకాలు. పగలంతా బళ్లో కూడా కలలు, వాళ్ళని గురించే వూహలు. వాళ్ళతో పరిచయం కావడం, నన్ను తెలిసినట్లు పలకరించడం, నన్ను సహాయం చేయనీయడం. అంత కంటె కలలు కనడానికి వయసులేదు. కాని ఆ మాధుర్యం వుంది. నేను పురుషుణ్ణి, వాళ్లు స్త్రీలు. మావూరి రౌడీలు కొందరు అల్లరి చెయ్యాలనీ, తెర వెనకాలకి జొరబడాలనీ ప్రయత్నాలు చేస్తున్నట్టు కూడా తెలుసు నాకు, అట్లాంటిదేమన్నా జరిగితే నాటకం స్త్రీలని ఎట్లాగో రక్షించడానికి నేను సిద్ధంగావుండాలని కాచుకుని

వుండేవాణ్ణి. ఆ నాటకానికి వొచ్చిన ప్రతి మనిషీ రౌడీగా కనపడి, నాకు విరోధి అయ్యేవాడు. ఆ దినాలన్నీ ఆ నాటకాల అందాలలో ఆ నర్తకుల ఆదరాన్వేషణలో బతికాను.

తను కాపరానికి వెళ్ళినప్పణ్ణించి మా అక్కయ్యకి నామీద పదింతలు శ్రద్ధ పెరిగింది. ఇంటికి ప్రతి వుత్తరంలోనూ నేనెట్లా చదువుతున్నానో, బుద్ధిగా వున్నానో అమ్మని అడుగుతోంది. నన్నెట్లా తన్ని చదివించాలో, గొప్పవాణ్ణి చెయ్యాలో సలహా లిస్తోంది. తాను పుట్టింటికి వొచ్చినప్పుడు ఆమె దృష్టి అంతా నామీదే వుంటుంది. నేను కూచోడంలో, భోజనం చెయ్యడంలో, చదువులో, మాటలో, అన్నిట్లోనూ నాలో వేలకొలది లోపాలు కనపడి మా అమ్మతో మాటాడేది. ఆమె నామీద సరైన శ్రద్ధ చూపటంలేదని, అవసరమైనంత తిట్టడంలేదని, నాన్నగారితో చెప్పి తన్నించటంలేదని. అదంతా ప్రేమ అని నమ్మమంటారు పిల్లల్ని. తామూ నమ్ముతారు పెద్దవాళ్లు. మా బంధువు లంతా పొగిడేవాళ్లు మా అక్కయ్యని, తమ్ముడిమీద ఎంత ప్రేమ అని. పెద్దవాళ్ళు ఎప్పుడూ తెలుసుకోలేని దేమంటే పిల్లలు మూర్ఖులు కారని, లోకపరత్వం, అబద్ధం, ఇంకా మనసులమీద కమ్మని పిల్లల మనసులకి వాస్తవాన్ని తెలుసుకునే స్వచ్ఛమైన శక్తి వుంటుందని. పిల్లలకు తెలీదు, కాని వాస్తవమైన విలవలు, యీ మాయ తెరల్ని తొలిగించి రిజిష్టరు చేస్తూనే వుంటుంది వాళ్ల మనసు। జాగ్రత్తగా వెతికి వెతికి నూరిపోసేది అమ్మకి, నా మిత్రు లందరు రౌడీలు, నా ఆటలు దౌర్జన్యాలు, నా మాటలు బూతులని ఏరి చూపుతో. కాపరానికి వెళ్ళకముందు నాతో చీవా

ట్లుతినే పిల్ల—అక్కయ్య ఆ కార్యం గదిలోకి వెళ్లి రాగానే, ఆ వొక్క పనితో ఆమెకి ఒక స్థానం, గౌరవం, విచక్షణ, విమర్శన, పీఠంమీద ఆసనం, అన్నీ కలిగినట్టు అనుకుంటోంది. ఆమె గోల ప్రారంభించింది నేను నాటకాలు చూసి ఎందుకూ కొరగాకుండా పోతున్నానని.

ఆనాటి రాత్రి నాటకం ప్రారంభించడం ఆలస్యమయింది. హాలులో కలవరం. అంతకు ముందే నేను లోపలికి వెళ్ళినప్పుడు నా రాజకుమారుడు కనిపించలేదు. గడ్డంసాయబు వేషం వేసి, 'ఇస్కీ మావురే బెల్లం' అని అప్పుడప్పుడు సరైన కథపట్టులో అనడం తప్ప పనిలేని మానేజరు తెర ముందుకువొచ్చి, రాజకుమారుడికి జబ్బుచెయ్యడంచేత ఆలస్యంగా ప్రారంభమౌతూందని చెప్పి క్షమార్పణ అడిగి లోపలికి వెళ్ళాడు. అతని వెనకనే నేనూ లోపలికి వెళ్ళాను. నా రాజకుమారుడికి జబ్బు!

అప్పటికే నా రాజకుమారుడు రంగు పూసుకున్నాడు. మోచేతులవరకూ కంఠం కిందికీ తెలుపు, తక్కింది కారు నలుపు. కాని నా కా భేదం ఆనాడు గుర్తులేదు. రెవికమీద ఓ గుడ్డని బిగించి కట్టుకుంటున్నాడు, కోటుపైకి తన స్త్రీత్వం కనపడకుండా నని ఇప్పుడు తెలుసు నాకు. అందరూ మంగళహారతి పాడుతున్నారు. జబ్బుతో వాడిపోయిన అతని మొహం కేసి చూస్తో, నా హృదయమంతా ఆమెకి ఇచ్చేసి దూరంగా నిలబడ్డాను. ఒక కొవ్వొత్తి కాంతి ఆమెమీద పడుతోంది. విరబోసుకున్న జుట్టు నల్లని వీపుమీద పమిట కిందకి వొదిలేసింది. ఎర్రని పెదవులు, తీర్చిన కనుబొమ్మలు, సన్నని మీసం. అటునించి నాటక ప్రారంభంలో నా గుండెలు కొట్టుకునేట్టు చేసే మంగళహారతి.

ఇటూ అటూ చూశాడు రాజకుమారుడు నిస్సహాయంగా. ఎవరూలేరు నేసు తప్ప.

అలసిపోయిన కంఠంతో "నాయనా! ఇలా రా" అంది. ఆకాశంనించి చుక్కలు మెరుస్తో లోపలికి వొచ్చి మాచుట్టూ నాట్యమాడాయి. సిగ్గుగా దగ్గిరికి వెళ్ళాను. ఆడది అని నాకు గుర్తుకు రాలేదు. కాని తెలుసు. మీకు అర్థమౌతోందికదూ ఆ చిత్తవృత్తి! ప్రతిదీ స్థిరంగా తెలిసిపోయిన మన యీనాటి గడ్డు మనసుకి అందదు, అలికినట్టు. మారినట్టు, కలిసిపోతున్నట్టు తోచే ఆ చిన్ననాటి దృష్టి. పధ్నాలుగేళ్ళు నిండిన నాకే అట్లా వుంటే, కొత్తగా లోకం చూసే శిశువులకు ఎట్లా కనపడతాయో యీ వొస్తువులూ, మనుషులూ అనుకుంటాను. గంతులేసే ఆవు దూడ కళ్లలో కనపడుతుంది ఆ కొత్తదనం, ప్రతిదీ కళ్లు తెరిచి చూసి చేతులు జాచే పసిపిల్లల భంగిమలో. ఆమె ఆడది అనే నిశ్చయమైతే! పమిటలేని ఆమె చాయలకు వెడతానా? ఈనాటికైనా వెళ్ళగలనా?

"రా నాయినా, దగ్గిరికి. ఈబట్టని వీపున బిగించి పిన్నులు పెట్టు" అంది.

నే నేమైనాను? అలాటి నిముషాల్లోనే యీ మనుష్య జీవితపు గొప్ప విలవలు అర్థమౌతాయి. అంత ఆనందం ప్రసాదించిన యీశ్వరుడిమీద అప్రయత్నంగా కృతజ్ఞత కలుగుతుంది. ఈనాడు అది రాదు. కాని ఓనాడు అనుభవించాము. ఆ ఆనందం యీ భూలోకానికే, మనుషులకే. అన్నీ తెలిసిన దేవతలకెట్లా కలుగుతుంది?

వొణుకుతున్న వేళ్ళతో ఆ వీపును బిగించాను. మేలు కుంటున్న నా పురుషత్వం నాకు తెలీకుండా గంతులేస్తుంది. నాలో ఉప్పొంగి వేళ్ళలో, నా కళ్ళలో జ్వలించి, నా వూపిరిని నా కంఠాన్ని నొక్కుతోంది.

తరవాత ఆ వల్కలాన్ని సర్దాను.

"Thanks" అనేందుకు తెలుగు మాట లేకపోవడం ఎంత దురదృష్టం. నా వంక నా కళ్ళలోకి చూసి చిరునవ్వు నవ్వింది ఆమె, అతను రాజకుమారుడు.

"నీ పేరేమిటి నాయనా?"

"మాధవరావు"

"చదువుకుంటున్నావా?"

"ఊ"

"పెళ్ళయిందా?"

"లేదు."

ఆమెపక్కన నుంచుని కోటు, కత్తి అన్నీ అందించాను.

రాజకుమార్తె పాట వినబడుతోంది. దీనమైన ఆ పాట మధ్యలో, దర్శకుల చూపుల్ని వెలిగిస్తో రాజకుమారుడు ప్రవేశిం చాలి రంగంమీదికి. నాకు తెలుసు.

"పాట!" అన్నాను.

ఎంత దయతో నవ్వింది!

"వెడుతున్నాను....చూడు....సరిగా వుందా? జుట్టు కన బడటంలేదు కదూ?" అంటోంది అద్దంలో తనని చూసుకుంటో. అద్దంలోంచే నన్ను చూస్తో, పెదవుల్ని ముందుకి చాచింది ముద్దువలె.

హడలిపోయినాను. మూర్ఛపడతా ననిపించింది కాని ఆ ఆవేదనలో "పాట. పాట. వెళ్లాలి" అంటోంది నా మనసు.

"పాట" అన్నాను పైకి.

"పాడనీ"

అని తీరికగా అద్దం పెట్టేసి, నా వేపు తిరిగింది. ఎంత ధైర్యం, ఎంత స్వేచ్ఛ! అంటే తనకోసం ఇట్లా పాడుతో వుండ వలసిందే, తను వెళ్ళతలుచుకున్నదాకా! రాజకుమారుడు మరి.

"వొళ్లు బావుండలా. వెళ్ళి గొంతు చించుకోవాలి." అంటో బద్ధకంగా బైలుదేరింది. ఆ బద్ధకం పోగొట్టడానికి నా రక్తం ఔషధంగా ఇద్దును. ఆమె పాదాలు గట్టిగా నడప నఖ్ఖర్లేకుండా, నా వొంటిని ఆ నేలమీద పరుద్దును! ఎలాగో నా లోపలి ఆరాధన అర్ధమయింది గావును, ఆ నాటిరాత్రి ఆమెకి. నా పక్కన ఆగి, నా చంపల్ని వేళ్ళతో పట్టుకుని వూయించి, ఒక్క పరుగు తీసింది.

అట్లానే నించునిపోయినాను: యత్నించి కూడా అడుగు కదల్చలేను. ఆ అద్దం, ఆమె వేళ్ళు తాకిన ఆ రంగులు, ఆమె విప్పివేసిన ఆ చౌక చీరె, అన్నీ. అన్నీ వెలలేని ఐశ్వర్యాలు! నుంచున్నాను. బైట పరుషవాక్యాలు, ఆ కథానాయకిని చెరవెట్టిన నీచుడినించి – కత్తియుద్ధం, పద్యాలు, వీరకీర్తనలు, డ్యూయట్లు.

రంగమైపోయి, నలుగురూ గబగబా లోపలికి వొచ్చారు. ఆమె నా వంక చూసి విసుకుగా "ఇక్కడ ఎందుకు, బైట వెళ్ళి కూచుని చూడు" అంది.

హడిలిపోయినాను. దీపాలారిపోయినాయి. కాళ్ళు తడబడుతో వెళ్లాను. ఏం చేశాను నేను అంత ఆగ్రహానికి?

ఈనా డైతేనా! కులాసాగా—

"ఆడవాళ్లు, వాళ్ల చిత్తవృత్తికి ఓ అర్థం వుందా? బుద్ధి లేనివాళ్లు" అనేసి, ఆ వేపుకి పోము.

కాని ఆనాడు ఆమె అనుగ్రహం మళ్ళీ సంపాయించిందాకా నిలవగలనా? నాటకం చూడలేదు. కళ్ళ నీళ్ళు, గొడవ పడే గుండె అడ్డమైనాయి. రాత్రి నిద్రలేదు. మళ్లీ, రాత్రి ఎప్పుడవుతుంది? కాని ఎట్లా చూస్తుందో నన్ను! అసలు నావంక చూస్తుందా? ఏమైనా వెళ్ళకుండా వుండలేను.

అక్కయ్య నాటకాలవాళ్లని తిట్టిపోస్తోంది. వాళ్ళు చేసిన పాపమల్లా, నన్ను లోపలికి రానిస్తున్నారనో, లేక తనకన్న వాళ్ళని ఎక్కువగా తలచుకుంటున్నాననో, ఇష్టపడుతున్నాననో! కాని నాటకాలకి ఉచితంగా వొస్తుంది, లోపలికి వొచ్చి వాళ్ళతో కులాసాగా మాట్లాడుతుంది, వాళ్ళని పొగడుతుంది. బైటికి వచ్చి తక్కిన ఆడవాళ్ళముందు బడాయి చూపిస్తుంది. వాళ్లు తనకి తెలుసునని వాళ్ళ ఆంతర్యాలు మాట్లాడుతుంది.

చిన్నతనంలో ఈ చౌర్యం చాలా బాధ పెడుతుంది పిల్లల్ని. తాము ప్రేమించే మనుష్యుల్నే అర్థంకాకుండా చేస్తుంది.

నా వయసుకి ఈవేషాలూ, అబద్ధాలూ అర్థంకావలసిందే నాకు. కాని అమ్మా నాన్నా చాలా సూనృతంకలవాళ్లు. ముఖం ముందు ఓమాట, వెనక ఓ మాట తక్కువ వాళ్ళలో. ముఖ్యం నన్ను ఇబ్బందిలో పెట్టరు. బంధువుల్ని తిట్టుకుని పిల్లలముందే, ఆ బంధువుమీదే తమలో కలిసి ప్రేమ నటించమంటారు పెద్దలు.

మా అక్కయ్యకి మా అమ్మా నాన్నమీద కూడా గౌరవం కొంత తగ్గింది, లోకానికి పనికిరాని వ్యర్థులని. అత్తవారియింటికి వెళ్లి చాలా అబద్ధాలు నేర్చుకుంది.

ఎందుకో ఆ రాత్రి నాటకానికి నేను వెళ్ళకుండా చెయ్యాలని పట్టుపట్టింది అక్కయ్య. మా బావకూడా జోడైనాడు. తన బావమరిది ఆవిధంగా గాడిద అయిపోతోంటే, నాటకపాకలు పట్టుకు తిరుగుతోవుంటే, తనకి అప్రతిష్ఠ అన్నాడు. మా నాన్నా అమ్మా ఏమీ అనలేదు. ఏరికోరి తెచ్చుకున్నాం ఇతన్ని, అతనిలో కలిసి మన పిల్ల ఇట్లా అయింది, అనుభవించాలి అన్నట్టు చూస్తున్నారు నాన్న అని తెలుసుకున్నాను నేను కొన్నేళ్ళకి.

నేను మాత్రం వెళ్ళితీరాలని నిశ్చయించుకున్నాను. ఏమైనా సరే. ఆమె మళ్ళీ నామీద దయగా నవ్విందాకా నేను బతకలేను.

నేను బయలుదేరుతోవుండగా మా బావ అడ్డమైనాడు అధికారంగా "ఎక్కడికి?" అన్నాడు. నేను తలొంచుకుని పరిగెత్తాను. తిరిగి వొచ్చాక ఏమైనా కానీ, ముందు నేను వెళ్ళాలి!

కొట్టుకునే గుండెలతో పరిగెత్తుకుని సరాసరి నాటకం పాకలోకి వెళ్ళి తెరపక్కగా నుంచుని చూస్తున్నాను. మా నాన్నగారి ఆధిక్యతవల్ల నాకు చొరవ అవూళ్ళో ఎక్కడికైనా సరే. యీ నాటకం పాకలోనూ అంతే. అందరూ గుంపుగా పోగై తొరతొరగా తయారౌతున్నారు. నెట్టుకుంటో నవ్వుకుంటో, అరుచుకుంటో. "ఆ కత్తి ఇట్లాతే. Puff అందియ్యి. నీకేం బుద్ధిలేదుటే, వొదులు." ఇట్లాంటి కేకలు. మధ్యమధ్య బూతులు. వాళ్ళ తక్కువజాతి భాష, తేలిక నవ్వు, చపక వేళాకోళాలు, అర్థంలేని కోపాలు, ఇవేమీ ఆనాడు నాకళ్ళ తెరపలేదు. ఇంకోళ్ళలో ఐతే, నా సహాధ్యాయులలోనైనా, వెంటనే నాకు అసహ్యం కలిగేది. కాని ఆమెమీద నా అనురాగం, ఘనత, వాళ్ళందరి మీదకీ కూడా ప్రసరించింది. ఓ మైకంలో, కలలో బతుకుతున్నాను. అజ్ఞానంలో

నని మీరన్నా నిజమే కావచ్చు. చచ్చిపోయింతరవాత ఎక్కడో మేలుకోవడమే వుంటే, పాత జీవితంలో అట్లాంటిఅంధకారంలో బతికామని అనుకుంటామేమో! కాని నా ఈనాటి వాస్తవం ఏమీ ఉన్నంత ఆనందం కాదు ఆనాటి మాయకన్న!

నేను వాళ్ళమధ్యకి వెడితే, ఒక మొగవాడు వచ్చాడనే ధ్యాస వొచ్చేదికాదు వాళ్లకి. నాముందే బట్టలు మార్చుకునే వారు. అవతల వారి మనసులో ఆ సిగ్గు లేకపోతే, అసలువాళ్ళ మనసులోనూ వుండదంటారు. అదీగాక నా వయసుకి చిన్న శరీరం నాది. రైళ్ళలో ఇంకా అరటిక్కెట్టే నాకు. అదీగాక వాళ్ళ మధ్య మొగాళ్ళు రంగులు వేస్తో రెవికలు సద్దుతోఉంటే, మొగ వాళ్లదృష్టి వాళ్ళని ఇబ్బందిపెట్టడం ఎప్పుడో మానేసింది అని తెలుసు.

చివరికి నా రాజకుమారుడి దృష్టి నాపైని నిలిచింది. చాలా నీరసంగావుంది ఆమె. నాపంక చూసి లోపల నవ్వుకుని—

"ఏం! మళ్ళీ నా రొమ్ములు బిగించాలని వొచ్చావా? బాగా మరిగాడు" అంది.

అందరూ పెద్ద నవ్వు నన్నుచూసి.

"ఏమిటి? ఏమిటి?" అన్నారు.

"నిన్నరాత్రి..................."

ఇంక బైటికి ఒక్క పరుగుతీశాను.

చాలా కోపం వచ్చింది నాకు. కాని ఏంలాభం? ప్రేమిం చిన మీకు అర్థమౌతుంది. కోపం వొస్తుంది ప్రియురాలిమీద. ఆమెను నరకాలి, చంపాలి, లేక రక్షించమని పాదాలమీద

వాలాలి. అంతేగాని మనకేమని ఉపేక్షించి వొదులుకోలేము. కాదూ—అనాడు అంతే నేను!

నాటకం చూడలేదు. పాక వెలపలినించి వినపడే పాటల ద్వారా మాటలద్వారా నాటకాన్ని వెంబడిస్తోనే వుంది వెనక మనసు. ఆమె అనుగ్రహాన్ని సంపాయించడం ఎట్లాగా అని మధ్య మధ్య ఆలోచన. కసి ఎట్లా తీర్చుకోవడమా అని నాటకశాలకి నిప్పంటించడం దగ్గరికి పోయినాయి వూహాలు! ఓ మూల అంటించి, యోధుడిమల్లే ఆమెను రక్షించాలి. కాలిపోనీలేను!

చివరికి ఆమెను వొంటరిగా కలుసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఎట్లా? నాటకమంతా తిరగవేసుకున్నాను మనసులో. ఈ కొత్త నాటకములో అతను స్త్రీవేషంతో అంతఃపురంలోకి వెడతాడు. నా రాజకుమారుడు, తనని కనుక్కున్న శత్రువులతో ఆడవేషంలోనే యుద్ధం చేసి తప్పించుకొని బైటపడతాడు. ఆ యుద్ధం జరుగుతూవుండగా వెళ్లి, సైడుకర్టెన్‌లో నుంచున్నాను. ఒక్కదూకుతో ఆమె నామీద పడ్డది, విచ్చుకత్తితో సహా. గట్టిగా కావలించుకుని పట్టుకున్నా. ఆశ్చర్యంతో మొహమెత్తింది. నేను కావిలించుకోవాలనుకోలేదు. నేను పడిపోకుండా ఆమెని పట్టుకున్నాను. నా తప్పు తెలిసి హడిలిపోయినాను. ఆమె స్త్రీ. బనారసు చీరె, నగలు, కోమలమైన ముఖం—నా వొళ్ళు ఏమయింది?

ఆమె తలెత్తి నన్ను చూసింది. కాని నా చేతుల్లోంచి తప్పించుకోలేదు; తీసెయ్యలేదు. ఆమె నేనూ ఒకటే ఎత్తు, కాని, నా చేతులు చాలా సన్నం!

పకపక నవ్వింది. చప్పున ఆపింది శబ్దమౌతుందని జ్ఞాపకం వొచ్చి.

'కుర్రాడా! కుర్రాడా!' అంది. నేనంతా కావలిసే పన్నాగం పన్నా ననుకుంది గావును. అపుదేమీ ఆలోచించలేదు. ఇంకా నా చేతుల్లోనే వుంది ఆమె. మరి ఆక్షణాన ఎదిగానో నామొహాం ఎట్లా మారిందో తెలీదు. ఆమె కావలిసే నన్ను అనుకుంది, అనుకున్నాను. కాని ఆమె యుద్ధంలో ఆలిసి అనుకుంది నన్ను, జబ్బునీరసం వల్ల!

నీరసంగా, "కొంచెం మంచినీళ్లు" అని నామీద బరువు వేసి కళ్లు మూసుకుంది. ఏం చెయ్యాను? ఎట్లా వొదలను? ఎట్లా మంచినీళ్లివ్వను? ఏం చేస్తే, మళ్లీ ఏం కోప్పడుతుందో, నా దేవి!

రెండునిమిషాల్లో కళ్లు తెరిచింది. అతిభద్రంగా కూచో పెట్టి కుండలోనీళ్లు తెచ్చి యిచ్చాను. ఆ ఎర్రని పెదిమలతో తాగి, నవ్వింది.

"ఇందాక వెళ్లిపోయినావు; కోపం వచ్చిందా?"

"ఊఁ- ఎందుకు నవ్వావు?"

"ఎంత అభిమానం! ప్రతిరోజూ నీచేతే బిగించుకుంటాను రొమ్ము. కోపం పోతుందా?"

"నీ వొళ్లు ఎట్లావుంది?"

"ఎట్లా వుందని చెప్పను? జరం."

"జరం!"

"మందు తీసుకుంటున్నావా?"

"మందు! నా కెవరు మందు తెచ్చిపెడతారు?"

"నేను తెచ్చిపెడతాను."

"సువ్వా !'

"ఎందుకు ఈ వేషం వేసి యుద్ధాలు చేసీ అలిసిపోతావు?"

ఏమిటో, నా కంఠంలో ఆమెకి ఏం వినపడ్డదో, కళ్ళనిండా నీళ్లు నిండాయి. చంపలమీద కారాయి. ఎట్టా తుడుచుకుంటుంది ? నా కప్పుడు తెలీదు, బనారసుచీర- నీళ్ళింకవు. పైగా ఎరుపు కూడాను. ఇటూ అటూ వెతుక్కుంటోంది. ఇంకా కుర్రాళ్ళు ఆనాడు అత్తర్లు వేసిన జేబురుమాళ్ళు ఎరగరు. నా చొక్కాతో తుడిచాను ఆమెకళ్ళని. దాంతో ఎందుకో ఆపుకోలేక ఏడ్చింది నా బుజంమీద చెయ్యేసి.

ఏం చెయ్యాను! ఏం చెయ్యాను! ఎందుకింత చిన్నవాణ్ణి ఇంకా!

అట్లా అనుకుంటోనే ఎదుగుతారు, పసిపిల్లలు పిల్లవాళ్లగా, పిల్లవాళ్ళు యువకులుగా, ఏవేవో చెయ్యాలనే కోర్కెలతో, తొరగా ఎదగాలనే ఉబలాటంతో అంతసేపూ అనుభవించే అదృష్టాన్ని, నిర్వ్యాజమైన ఆనందాన్ని, వెనక్కి వొదిలేసుకుంటో.

"నాయనా! ఏం దయ నాయనా, యీ దిక్కుమాలిన దానిమీద?"

అని నా తలని రొమ్ముకి అద్దుకుంది.

ఈనాడు తెలుసు నాకు. ఆమె చాలా సాధారణమైన స్త్రీ. తెలివిలేదు, సంస్కారం లేదు, సంఘంలో నీచురాలు. అమాయకుడైన కుర్రవాణ్ణి నేను. నేను కట్టుకుంటున్న అందాలు, ఔన్నత్యాలు, నా భావాలు, అన్నీ అబద్ధాలు, వాస్తవ ప్రపంచంలో! ఎదిగిన కళ్ళ సత్యానుభవంలో నవ్వులపాలు!

కాని ఆ నిమిషాన వెర్రి సానుభూతి చూపే నా నిస్సహాయపు ఆదరం వల్ల ఆమె హృదయం నటనలతో, దుమ్ములో పురుషుల మట్టి కోర్కెలలో మకిలిపట్టిన ఆమెఆత్మ లోపలినించి, నా నిర్మలమైన దయవల్ల, కదిలి నాపైకి ప్రసరించిన ఆమె ప్రేమని గమనిస్తే, ఎంత కల్మషంగా కనపడనీ లోకం, మానవులు ఎంత తుచ్ఛులైనా, లోపల యీ పై పై కల్మషాలకి చిక్కక తప్పించుకున్న దైవత్వం ఇంకా లేదనగలమా ఏ జీవిలోనైనా?

మర్నాడు పొద్దున్నే ఆస్పత్రికి వెళ్లాను. డాక్టరు మా ఇంటి డాక్టరు. ఎవరికి జ్వరమని చెప్పను? మా వాళ్ళకి ఎవరికో జ్వరమని చెప్పడానికి కొంత సెంటిమెంటుకూడాను. ఆమె నాది. ఆమె జ్వరమూ నాదే!

"జరంగావుంది డాక్టరుగారూ?"

"నీకు జరమా? ఎన్ని రోజులనించి?"

"నాలుగు రోజుల్నించి."

"రాత్రంతా మేలుకుని నాటకాలు చూస్తున్నావు కదూ?"

ఆయనా చూస్తున్నాడు.

తాకి చూశాడు నన్ను—

"జరం లేదే!"

"రాత్రిళ్లు వాస్తోంది."

"వుత్త జరమేనా?"

ఆమె దగ్గింది కూడానూ.

"దగ్గు కూడా."

చీటీ రాసి ఇచ్చాడు.

తీసికెళ్ళి కాంపౌండరుకి ఇచ్చాను.

"ఇట్టారండి. నోరు తెరవండి."

ఇదేమిటి నన్ను నోరు తెరవమంటాడు? కాని ఏం చెయ్యను?

ఓ మందుపుల్లపెట్టి కంఠంలోపల కెలికాడు. చేదు. కాఫీ, పెసరట్లూ కక్కాను!

"జరంవొచ్చి పెసరట్లా! ఏం తినవద్దు. సగ్గుబియ్యంజావ."

అంతటితో తీరలా నా అవస్త. ఓ డోసు చేదుమందు తాగించాడు.

ఐతేనేం. బుడ్డిలో మూడురోజుల మందు దొరికింది. ఏ బాధా తెలీకుండా ఆ బుడ్డీ పట్టుకు పరిగెత్తాను. సంజీవిపర్వతం తీసికెళ్లే హనుమంతుడిమల్లే——

నాటకంవాళ్ళు సత్రంలో బస అని తెలుసు నాకు. తీరా గుమ్మం దాటి వెళ్ళిందాకా, ఏం మాట్టాడాలో ఆలోచించుకోలేదు.

ఇంకా అందరూ నిద్దర్లు లేవలేదు. కొందరు కళ్ళు నులుముకుని కూచున్నారు.

ఆ పక్కబట్టలు చూసి ఐనా నాస్వప్నం చెదిరిపోలేదంటే, నా ప్రేమ వెర్రితనాన్నో, ఔన్నత్యాన్నో యోచించుకోండి. మా నాన్నగారు సంపన్నులు. మా మంచాలూ, పరుపులు, దుప్పట్లూ చాలా దర్జాఐనవి మరి.

ఆ బట్టలు, చిరిగిన మురికి దిళ్ళు, నలుపు—కంపు! ప్రేమ వున్నప్పుడు మాలిన్యం దిగులు పుట్టించి ప్రేమలోతుని ఎక్కువ చేస్తుంది. నీతిపేర, దయపేర ఖండించే ఈ లోకపు సంఘాధిపతులకు ఎన్నటికీ అర్ధంకాదు ఆ మాట.

వాళ్ళలో ఒక్కరూ నాకు గుర్తురాలేదు. రాజులు, రాణులు, రాక్షసులు, సఖులు అందరూ వికృతంగా కూచుని వున్నారు.

"ఆమె ఎక్కడ?"

"ఎవరు?"

ఏమని అడగను?

"రాజకుమారుడు"

ఇంకేమనాలో తోచలేదు.

అర్థంకాలేదు మొదట. ఒకామె పక్కన నవ్వింది.

"రత్తీ! నీకోసమొచ్చాడే ఈయనగారు!"

"ఎవరు?" అని మూలిగింది చింకిగుడ్డల్లోంచి ఒకామె.

"నీ భర్తుడు!"

చేతిమీద తల నానించి మొఖమెత్తి చూచింది. ఎవరది? ఎవరు?

గుర్తేరాలేదు నాకుకూడా. రంగుపూసుకోకుండా ఆమెను ఎన్నడూ చూడలేదు నేను. నిజానికి మా దాసీది చాలా నయం, నా రాజకుమారుడి కన్న.

"ఇట్లారా? ఏ మొచ్చావు?"

"మందు తీసుకొచ్చాను." అంటో చూస్తున్నాను ఆమెకేసి. ఏమిటీ వికృతమని.

"మందూ?"

"జరానికి."

"నా బాబువి. తీసుకొచ్చావా? నీ తల్లికడుపు చల్లగా. ఎంత దయ అమ్మా నీకు నామీద."

అని నవ్వింది. నా రాజకుమారుడు నవ్వాడు! ఆ పళ్ళ వరస చూడడంతో నా దుస్వప్నం తొలిగిపోయింది. నా రాజ కుమారుడు నాముందు నిలిచాడు! కాని ఆ మురికిలో నిలవలేను.

నవ్వకండి నన్ను చూచి. మాయదుప్పట్లు దళసరి భేదం అంతే.

ఈనాడు తెరమీద చేసే సినిమానటీమణులు అసలు ఎటు వంటివారో అనే ఆలోచన వుంటుందా ఇన్నేళ్ళొచ్చిన మీలో యెవరికన్నా?

"మూడు రోజులు. ఇప్పుడూ, మధ్యాహ్నం, సాయంత్రం. అన్నం తినకూడదు."

అంతవరకూ చిన్నడాక్టర్ని!

"సగ్గుబియ్యం జావ తాగూ... " ప్రియుణ్ణి ఆ మాటకి.

"సగ్గుబియ్యంజావా? నా కెవరు కాచిస్తారు."

ఏం చెప్పను దానికి?

సగ్గుబియ్యం జావ కాచి ఇచ్చేవాళ్లే లేరా నా రాజకుమారుడికి? లోకం చాలా క్రూరరూపాన్ని దాల్చింది. నా మనసులో మనుషులు రాక్షసులైనారు.

"మళ్ళీ వస్తాను" అని బైటపడ్డాను.

ఆలోచించాను. ఆ వూళ్లో మా అత్తయ్య వుంది. ఆమెకి నామీద చాలా ప్రేమ. ఎందుకో మరి—ఆమె కొంత వెలి. మా యింటికి రాదు. ఆమెని ఆశ్రయించి, మా స్నేహితుడికి, బీద వాడికి జరమని చెప్పి, జావ సంపాయించాను. మధ్యాన్నం బడి వొదలగానే రెండు గంటలకి ఆ జావ తీసుకుని సత్రానికి మైలున్నరా ఎండలో పరుగెత్తాను.

చాలామంది నిద్రపోతున్నారు. రాజకుమారుడుకనపడ్డాడు.

"ఊఁ"

"ఏమిటి నాయనా, ఇంత ఎండలో?"

"నీకోసం సగ్గు..."

ఏమిటో తింటోంది ఆమె. కారు నలుపు ఆమె. పెదవులూ చాలా నలుపు.

"ఇంద" అని నాకు పెట్టింది.

పకోడీలు! పకోడీలు!

"ఇదేమిటి? పకోడీలు తింటున్నావు?"

"అన్నం తినవొద్దన్నారుగా నా చిన్నడాక్టరుగారు!"

కాని పకోడీలు!

"తే, జావతే, తాగుతాను. నువ్వు తిను మరి!" అని పకోడీలన్నీ నా కిచ్చేసింది.

అన్నం తినలేదు నేను. ఆకలేస్తోంది. తిన్నాను పకోడీలు. అబ్బా! ఏమిటిది? ఎంత కంపు—ఎప్పుడు చేసినవో! డోకు. డోకు. కాని ఆమెచేత్తో నా కిచ్చిన పకోడీలు మింగాను రెండు. బడివేళ అయిందని ఆ పకోడీలు పట్టుకుని పరిగెత్తాను. తినలేదు. వాటిని నా పుస్తకాల డ్రాయర్లో భద్రంగా దాచుకున్నాను.

కొన్నాళ్ళు టిక్కెట్టు లేకుండా నాటకాలు చూసినతరవాత అమ్మ అంది "ఆ నాటకంవాళ్ళని భోజనానికి పిలుద్దామా? అని. నాన్నగారు సరేనన్నారు.

"అవును. పిలు పాపం! చాలా నాటకాలు పూరికే చూశాం."

వాళ్ళు! మాఇంటికి భోజనానికి! ఇక్కడ మా ఇంటో! నిజంగా జరుగుతుందా? నా కమితంగా ఇష్టమైన భారతంలోని

పంచపాండవులూ వొస్తారంటే మాత్రం అంత సంతోషం వొస్తుందా? వాళ్లు వొస్తారా? ఆ రాజపుత్రికలు! వొచ్చి యీ అన్నం అదీ తింటారా?

"ఛా—వాళ్ళని పిలుస్తావా భోజనానికి?" అంది అక్కయ్య. నా కంత సంతోషమని ఈ అక్కయ్యకి ఎట్లా తెలుసో!

"ఏం! భోజనానికి పిలిస్తే!"

"అదేమిటి! వాళ్ళు బజారుముండలు. ఛీ—వాళ్ళు మన ఇంటికేమిటి?"

"ఏం వాళ్ళ నాటకాలు మనం చూడటం లేదా? పిలిస్తేనేం?"

ప్రతిమాటా, నా ప్రాణమంతా వాటిమీద ఆధారపడ్డట్టు, ఊపిరి బిగపట్టి వింటున్నాను. మా అక్కయ్యగొంతు నులిమితే! దీనికేం పుట్టింది! దీన్నేనా, చిన్నప్పుడు అంత ప్రేమించాను!

"అయినా వారికి బాపుండదు. ఇల్లాంటి ఆడవాళ్ళని అసలు భరించలేరు. ఆయన బ్రహ్మసమాజం. అమ్మో ఎంత పట్టింపనుకున్నావేం? ఇల్లాంటిపనులు చేశారంటే, ఇంక మీఇంటికి రావడంకూడా మానేస్తారు."

ఆ బ్రహ్మస్త్రానికి తట్టుకోలేకపోయినారు మా అమ్మా నాన్నా!

"ఏమిటమ్మా! పిలవ్వా భోజనానికి" అన్నాను.

"నీకేం పుట్టిందే? వాళ్ళు వొస్తె నీకూ నీమొగుడికీ ఏం? మీగదిలో కూచోండి" అన్నాను.

"చూశావా అమ్మా! వీడికెంతవరకు—వచ్చిందో! ఎందుకూ కొరకాని వెధవగా తయారుచేస్తున్నారు—వీణ్ణి. వీడికి నాట

కాలతో ఏంపని చదువుకోక! ఏం పాసవుతాడు ఈ ఏడు? ఆయన కూడా అదే అంటూన్నారు, ఎందుకూ పనికిరానివా డౌతున్నాడని"

ఇంటి అల్లుళ్ళ అభిప్రాయాలంత శాస్త్రవచనాలు, అనుల్లంఘనీయమైన ఆదేశాలు వుండనే వుండవు!

ఆరాత్రి ఆమెవెంటనే తిరిగాను, జరంతో నీరసపడ్డ సు రాజకుమారికి నావల్ల ఏం అవసరం కలుగుతుందోనని. ఇంకా సత్రాళ్ళకి జేబుల్లో డబ్బు గలగలలాడని రోజు లవి. మా అమ్మ నడిగి అణా సంపాయించి పిప్పరమెంటు బిళ్ళలు కొని, ఆమె నోటికి అందిస్తున్నాను, ఆ ఎర్రని పెదిమల మధ్యకి. మా ఇద్దరి మధ్య చనువూ, నవ్వులూ, వేళాకోళాలు ఏర్పడ్డాయి. ఈ నాటికీ అంటాను నిజమైన స్వచ్ఛమైన స్నేహం స్త్రీనించి కావాలంటే సంఘంలోంచి దూరంగా వుండే స్త్రీలలో తప్ప ఆ నిష్కాపట్యం దొరకదని. ఎందుకో మరి మన స్త్రీలలో పాతివ్రత్యమూ, ఇయ్యడాలూ పుచ్చుకోడాలూ, మర్యాదలూ తప్ప, లోపల్నించి ఇంకేమీ ఆలోచించని స్నేహం అవ్యాజంగా, మనిషీ మనిషీ మధ్య సంకోచం లేకుండా కలగదు.

కాని స్నేహాల్ని అట్లాగే వొదిలి లోకం వూరుకోదు, తన ముక్కుని మూల మూలలా దూర్చి కలుషితం చెయ్యకుండా.

మొగవేషం మార్చేసుకుంటో, తన కోటువిప్పి నామీద పడేశాడు నా రాజకుమారుడు. ఆ కోటును భక్తితో చేతులో పట్టుకొని....

ఇంతలో గడ్డం మానేజరు వొచ్చాడు.

"ఇదేమిటి? నీకు మతిపోయిందా? ఎవరనుకున్నావు

ఈ అబ్బాయిగారు? నీకు మరీ పొగరెక్కువౌతోందే, రత్తీ! తన్నులు కావాలా?" అన్నాడు.

దిగ్భ్రమచెంది నుంచున్నాను. స్టేజీమీద పక్కలకి వొదిగి వొణికే గడ్డం సాయేబుగాడు నా రాజకుమారుణ్ని అంటున్నాడా ఈ మాటలు! వాణ్ణి దవడపగలకొట్టగల బలమే నాకు వుంటేనా?

రెండు గౌరవాలకి సంఘర్షణ నాలో. నా బైటి గౌరవానికీ, నా లోపలి నామీద గౌరవానికీ.

నిజంగా ఆ సమయంలో గర్వించాలి నేను. ఆమెముందు నన్ను మేనేజరు పైకెత్తినందుకు—మా నాన్నగారి కొడుకునని—కాని నాలోపలి గౌరవం, ఆమె మిత్రుడికింద నన్నంగీకరించిన గౌరవం గాయపడ్డది. పైగా ఆమెని, నా రాజకుమార్తెని తిట్టడం. అప్పటికప్పుడే క్రమంగా నా హృదయాభిషిక్తుడైన రాజకుమారుడికన్న రాజకుమార్తే నాకు అభిమానమయింది. ఆ తెల్ల పళ్ళ నవ్వు గులాబిపెదవుల మధ్య; చంకలవరకు సున్నని తెల్లని చేతులు, రహస్యాలు పలికే మెడవొంపు, ఎత్తయిన వక్షంమీద వూగిసలాడే పూసల వజ్రహారాలు! ఆమె పాట—నడక, కనుకొలు కుల్లోంచి చూపులు!

కాని ఆరాత్రి ఆమె కట్టుకున్న చీర, అత్తరు పరిమళాలు! ఇంటి జ్ఞాపకాలు....మా అమ్మ బట్టలపెట్టె తెరిచినప్పటి పరిమళాలు!

ఎర్రటి పట్టుమీద నిజమైన జరీ అల్లికలు.

"ఇట్లాంటి చీరే మా అక్కయ్యకి వుంది" అన్నాను. ఆమె సిగ్గుతో నవ్వింది.

నేను ఇచ్చిన మందు మహత్యమో, జాపఅదృష్టమో ఆమె పర్నాటినించి తేరుకుంది. అప్పటినించీ నాకు చాలా గట్టి యోచనపట్టుకుంది—ఆమెకీ, ఆమె పరిస్థితులకీ సంబంధం లేదు. ఆమె రాజకుమార్తె. ఎందువల్లనో యీ చీదరలో, యీ మనుషుల్లో పడ్డది. ఆమెని ఎట్లా రక్షించను? ఆలోచనలు, కలలు, ఆశలు.

ఓనాటిరాత్రి మా అమ్మ పక్కన పడుకున్నాను. పడుకో బోయేముందు మా అమ్మ మామూలుగా చాలా ముద్దుచేసి మాట్లా డుతోంది నాతో.

"నువ్వు బి. ఏ. ప్యాసవుతావు. నీకు తాసిల్దారు ఉద్యోగం అవుతుంది. అప్పుడో చక్కని పిల్లని తెచ్చి, పెద్ద కట్నంతో పెళ్ళిచేస్తాను," అంది.

ఆలోచించకుండానే నేను—

"నా కిప్పుడే పెళ్ళిచెయ్యి అమ్మా!"

"ఇప్పుడే! ఏమి టా తొందర? అప్పుడే పెళ్ళికూతుర్ని ఏరుకున్నావా ఏమిటి?"

నేను సిగ్గుతో మాట్లాడలేదు.

అమ్మ నవ్వుతో నా గడ్డం పట్టుకుని "నిజం చెప్పు, అవునా?" అంది.

"ఊఁ" అన్నాను దిండులో తల దూర్చి—

గుండెలు కొట్టుకుంటున్నాయి.

"ఎవరేమిటి?"

"రాజకుమారుడి వేషం వేస్తుందీ...."

అమ్మ పెద్దపెట్టున నవ్వింది. కాకపోతే నాలోవున్న పెద్ద పట్టు ఆమెకి తెలిస్తే—

'ఏం చదివావు నాయనా' అని ప్రహ్లాదుణ్ణి తండ్రి అడిగిన రకం అయిపొయ్యేదే!

అమ్మ నవ్వి పక్కగదిలో పేపరు చదువుకుంటున్న మా నాన్నగారితో—

"ఏమండోయ్! విన్నారా మీ అబ్బాయి అప్పుడే పెళ్లి కూతుర్ని వరించాడు."

"ఓ" అన్నారు నాన్న చదువుకుంటూ.

"ఎవర్నో తెలుసా?"

"ఎవర్నేమిటి?"

"ఆ నాటకాల రత్తినిట!"

నా ప్రాణం చివుక్కుమంది.

మా నాన్న సరైన శ్రద్ధని ఇవ్వలేదు.

"చాలా చిక్కులు వొస్తాయి," అని నవ్వారు.

ఆ జవాబుకి అర్థం—ఆనాడు తెలీలేదు నాకు—

ఆమెని పెళ్లిచేసుకొని ఉద్ధరిద్దామనేది నా గట్టి కలలో ముఖ్యమైనదిలాగుంది!

ఈ లోపల నాటకాల హాలులో ప్రజలు తక్కువవుతున్నారు. వాళ్ళు వేసే ఆ నాలుగు నాటకాలూ చూసిచూసి మా వూరి వాళ్ళకి విసుకుపుట్టినట్టుంది. నాటకం కంపెనీ పొరుగూరికి వెళ్ళిపోతుం దనుకుంటున్నారు. జన్మంతా ఈ నాటకాలు చూసినా, మనుషులకి ఎందుకు విసుకు పుడుతుందో నాకు అర్థంకాలేదు.

వాళ్లు వెళ్ళిపోతే, నే నెందుకు బ్రతకడం? ఏం చెయ్యాను? ఎందుకు చదివి, ఉద్యోగంచేసి, పెళ్ళిచేసుకోడం?

ఒకరోజురాత్రి ఆమెతో "మీరు వెళ్ళిపోతారా?" అన్నాను.

"ఊఁ"-

అంటో నా మొహంకేసి చూసింది. నా దిగులంతా కనబడ్డ దనుకుంటాను.

"దిగులా?" అంది.

"అవును. నిన్ను చూడకుండా...."

"నిన్నూ తీసుకుని వెడతాను. మీ నాన్నగారి నడుగు."

"బాపగారు తంతారు" అని నవ్వింది ఏడుపుపాట్లువేసే నరసమ్మ.

నా రాజకుమార్తె ఆమెని చంపేట్టు కోపంగా చూసింది ఆమెవొంక. వేళాకోళంగా నవ్వే నరసమ్మ చప్పున ఆగింది.

నా కర్థం కాలేదు. నా కలలలో నే నున్నాను!

"నా చదువో" అన్నాను.

"ఇంకెందుకు చదువు. నాతో నాటకంలో వేషాలు వేద్దుగాని!"

"నిజంగా నేనా?"

"ఊఁ" అంది గోముగా.

ఆ నాటనించి నా భవిష్యత్తు చాలా నిశ్చయంగా స్థిరపడి పోయింది. ఎప్పుడూ ఆమెవెంట, ఆమె సేవచేస్తో ఆమెని రక్షిస్తో-మా డాబామీద సాయంత్రాలు కలలుకనేవాణ్ణి. నేనూ వేషం! ఏం వేషంవుంటుంది నాకు? శత్రురాజువేషమా—వెయ్యాను.ఆమెతో యుద్ధంచేసి, విరోధపడాలి. కాదు ఆమె రాజకుమార్తె. నేను

రాజకుమారుడు! నేను బిల్హాణుడు, ఆమె యామిని! అంతకన్న ఏంకావాలి? జరుగుతుందా?

అటువంటి అదృష్టం నా జీవితానికి పడుతుందా? ఆ రంగులు పూసుకుని, చమ్కీకోటు వేసుకుని, కత్తి తగిలించుకుని—వొళ్లు పరవశమయ్యేది, రాత్రింబవళ్లు ఎప్పుడూ ఆమెని చూస్తో—నా సన్నని పీలవొళ్లు, నాకు సంగీతం రాకపోవడం, ఏమీ అభ్యంతరాలుగా తోచలేదు.

నాన్నగారు వొప్పుకుంటారా? వొప్పుకుంటారు! ఇంకా చదవమంటారా? ఆమె పిలిచిందంటే! నాటకాల్లో వేషాలకి యోగ్యుడా మావాడు, తెలీనేలేదే అని గర్వపడతారు. మళ్లీవొచ్చి ఈవూళ్ళోనే నాటకాలాడితే. నా సహాధ్యాయులూ, టీచర్లూ ఎంత ఆశ్చర్యపడతారు? ఈర్ష్యపడతారు!

తెలుసు నాకులోపల ఇవన్నీ వుత్త ఆలోచనలని, కలలని, నాటకవేషాలు వెయ్యడం ప్రజలదృష్టిలో నీచమని, నాన్నగారు వొప్పుకోరని, నేను వేషాలకి పనికిరానని!-కాని ఇవన్నీ అబద్ధమైనా నాకూ ఆమెకీ మధ్యవున్న సున్నితమైన అనురాగం, యీ స్వచ్ఛమైన ఆలోచనామేఘాలకి తాత్కాలికమైన రంగు కాంతుల్నిచ్చింది.

అంతే కద జీవితం.

తమలో వున్న సామర్థ్యాలు, సద్గుణాలు ఉన్నాయని అబద్ధంగా విశ్వసించని మనుషులెవరున్నారు? ఉన్నాయని పూర్తిగా విశ్వసించి, వాటిని నిజంగానే తెచ్చుకుని విజయవంతులయ్యే వాళ్ళు ఎందరు లేరు?

ఆ రాత్రి మనుషులు ఎవరూ రాలేదు నాటకం చూడ్డానికి. నిరుత్సాహంగా బద్ధకంగా జరుగుతోంది నాటకం. హరిశ్చంద్ర. నా రాజకుమారుడికి ఆ నాటకంలో కలహాకంఠి పాత్ర. హరిశ్చంద్రుడు ఒక మొగాయనే వేసేవాడు. వేషం వేసుకుని పనిలేకుండా కూచుంది నా మిత్రురాలు. ఆమె రూపం జగన్సమ్మోహనంగా వుంది. జాజికాయపెట్టెమీద కూచున్న ఆమె పాదాల దగ్గర ఆమె కెదురుగా కూచుని ఆమెకేసి చూస్తో వుండిపోయినాను ఎంత సేపటినుంచో. కొన్ని నిమిషాలనించి ఆమె నా మొహంకేసి చూస్తోంది, ఏం ఆలోచిస్తోనో! తెరముందునించి మనుషులు వొస్తున్నారు. పోతున్నారు. పాటలు, మాటలు, అరుపులు వినపడుతున్నాయి. నాకు అదంతా చాలాదూరం. ఆమె కళ్ళనిండా అకారణంగా నీళ్ళు——

"ఏమిటి? ఏమిటి?" అంటో ఆమె తొడలమీద చేతులు వేశాను.

నా చంకలకింద చేతులు వేసి నన్ను పైకి లాక్కొని, నా గడ్డం ఎత్తి పట్టుకుని నా కళ్ళల్లోకి చూస్తో గద్గదకంఠంతో చాలా జాలిగా-

"నన్ను ఏమిటి అనుకుంటున్నావు?" అంది. ఆమె పెదిమ వొణికింది. మొహంమీది రంగుమీదనించి జారిపోతున్నాయి కన్నీటిధారలు.

ఏం చెప్పగలను?

ఎందుకట్లా నా వంక చూస్తావు? నేను వుత్తరంగు. వుత్త గాజుపూసలు——నా బతుకు...." అని వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమెరొమ్ముమీద గిల్టుదో బంగారమో కొత్త పలకసర్లు మెరుస్తున్నాయి. ఎక్కడో జ్ఞాపకాలు- రొమ్ముమీద కదులుతో మెరిసే ఆ గొలుసు.

ఆమెని నా చిన్న చేతులతో కావిలించుకున్నాను. మెడని నా దగ్గిరిగా లాక్కున్నాను.

"ఏడవకు. నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను. నేను తాసిల్దారు నౌతాను."

పక్కున నవ్వింది కన్నీళ్ళలోంచి-

"నా చిన్న బాబూ! బాబూ!" అని దగ్గిరిగా వొత్తుకుంది, కఠినమైన ఆ వక్షానికి.

కొంచెం వుండి నన్ను వొదిలి, జాలిగా—

"పెద్దయి, నిజం తెలుసుకుని, నను తలుచుకుని సిగ్గుపడతావు. దీన్ని, యీ రత్తినా, నే నంత ప్రేమించింది అనుకుంటావు. నిన్ను మోసగించానని తిట్టుకుంటావు. కాని నువ్వు నాకు...." అని యేడ్చింది.

నా దిగులూ చూసింది గావును, భరించలేక చప్పున లేచింది. ఆ రాత్రి ఆమెకి చాలా తీరుబడి.

"నువ్వు నా బాలకృష్ణుడు. నే నెవరు?"

"నువ్వు నా రాధవి," అని కావిలించుకున్నాను.

"రా నిన్ను తయారుచేస్తాను—"

అని నాకు నీలంరంగు పూసింది నవ్వుతో, తన సొంత వేళ్ళతో. నా జుట్టుని నెత్తిన ముడేసింది. పీతాంబరం కట్టింది. తన మెళో పలకసర్లు నాకు అలంకరించింది.

అందరికీ చూపుతోంది. 'నా కృష్ణుణ్ని చూశారా?' అని. ఆ రాత్రే ననుకుంటా నా జీవితానికల్లా గొప్పరాత్రి! చచ్చి చెడి, చుట్టూ తిరిగి యాభై రూపాయలు ఆరాత్రి కిచ్చి తెచ్చుకున్న శ్రీనించి మాత్రం ఏమొస్తుంది మనకి! ఏ మాయలోనైనా సరే కళ్లు కప్పి, మనని కరుణించి దేవతలు అల్లాంటి అదృష్టంలో ముంచాలి తప్ప! వాస్తవానికి కళ్ళు తెరిచినకొద్దీ స్వర్గానికి దూరం-జ్ఞానం! జ్ఞానం! ఎందుకు జ్ఞానం....? దేవుడు లేడు, అప్సరసలు లేరు, స్వర్గం లేనేలేదనే జ్ఞానం—

అందాన్నంతా అణువుల చేరిక అనే జ్ఞానం—

మోహం మనోవికారమనే వైరాగ్య జ్ఞానం-

అప్సరసలూ, స్వర్గం, వీటిని భూమి మీదికే, నీ చేతుల్లోకే, మామూలు మట్టి మనుషుల్నే దేవతల్ని చెయ్యగల మాయ ఇంద్రజాలాన్ని ధ్వసంచేసే వాస్తవం!

అట్లాగే తిరిగాను ఆ రాత్రి. ఆడియన్సులోకి వెళ్ళవొద్దంది రాధ. కాని బైట తిరుగుతున్నాను బడాయిగా. మా బావ కనబడి నన్ను గుర్తుపట్టలేదు. నా అలంకారాలవంక చూస్తున్నాడు తీక్షణంగా, తన పంది కళ్ళతో!

"ఏం బావా?" అన్నాను, చాలా గర్వంగా.

"నువ్వా!" అని నా మెళ్లో పలకసర్లు పట్టుకుని,

"ఇదెక్కడిది నీకు?" అని నా మెడలోంచి తీసి లాక్కున్నాడు, గట్టిగా పట్టుకునే నా చేతుల్ని విరిచి తీసేసి.

గబగబ కన్నీళ్ళతో లోపలికి వెళ్ళాను.

"మా బావ పలకసర్లు తీసుకున్నాడు, నీవి!" అన్నాను.

"ఓ—"అని మొహం తిప్పేసి మానేజరుతో మాట్లాడు తోంది.

"ఎవరినన్నా పంపించు!"

"సరేలే" అంది.

అంటోనే నన్ను దగ్గిరికి తీసుకుని మనసు మాటలకిచ్చి, పరధ్యానంగా, నా జుట్టుతో ఆడుకుంటోంది.

"తెప్పించు" అన్నాను.

ఆమె కొంచెం విసుకుగా, తెరలెత్తేవాడితో—

"సూరయ్యగార్ని అడిగి నా పలకసర్లు తీసుకురా—" అంది.

మా బావ ఎట్లా తెలుసు ఈమెకి?

తెరల అతని వెనకనే మా బావ వొచ్చాడు. ఆమె వెనక దాక్కున్నాను నేను. మేము చీకట్లో వున్నాము.

"ఆ వెధవతో ఆ సరాగా లేమిటి?" అంటున్నాడు కోపంగా మా బావ.

నా చేతిని గట్టిగా పట్టుకుని ఆమె,

"ఆ పలకసర్లు ఇట్లా ఇచ్చివెళ్ళండి," అంది కోపంగా నా రాజకుమార్తె.

"ఏమి టీ వేషాలూ నువ్వూ! పో, ఇంటికి పో" అన్నాడు నన్ను మా బావ.

నా మాయ విడిపోయేటంత దగ్గిరిగా అపాయంలో కొట్టు కొంటోంది.

"లోపలికి ఎందుకు వొచ్చారు మీరు? వెళ్ళండి" అంది ఆమె.

ఎటాగో మా బావని ఎరుగును ఈమె.

అతను కదలలేదు. కొడతా దేమో నా రాజకుమా ర్తైని—

"వెళ్లండి, ముందు వెళ్ళండి, తరవాత మాట్లాడతాను. నా బొబు మెళ్ళోంచి తీశారా? వెయ్యండి మళ్లీ" అంది కోపంగా.

"నీబొబు! బొబు! వుండు చెపుతాను నీ పని!"

అంటో పలకసర్లు నా మెళ్ళో వేసి వెళ్లిపోయినాడు మా బావ.

ఈనాడు తలుచుకుంటే, మా ఇద్దరిమధ్య ఇంద్రజాలం చెదిరిపోకండా, అన్ని నెలలూ ఆమె ఎంత జాగ్రత్తపడ్డదో! నా కోసమా! కాని ఆమెకే ఆ మాయ, నా వెర్రిప్రేమ అవసర మయ్యా? అనుకుంటాను. కాని ఆమెకైనా తెలుసా?

అట్లా వుంటాయి మనుషులు కట్టుకునే సౌధాలు. మర్నాడే అన్నీ నేలకూలాయి!

మా క్లాసులో ఎప్పుడూ నేను First. ప్రతి నెలా అమ్మా నాన్నా కనుక్కుంటోవుంటారు, నేను ఎన్నో ప్లేసు అని. ఆ కాలంలో మాకు మార్కులూ ప్లేసులూ వుండేవి బళ్లో. నేను మొదటి స్థానంలో వున్నన్నాళ్లు, నేను చదువు తున్నా నా లేదా అని శ్రద్ధవహించరు. నాకు స్వేచ్ఛ. ఆ నెల మూడో ప్లేసుకి దిగాను. దాంతో నా కథ తారుమారయ్యింది. అమ్మ నన్ను చివాట్లు వేస్తోవుండగా, అటుపోతున్న మా బావ వొచ్చాడు. అమ్మ వెళ్ళి పోయింది, అతను మాటలాడుతోవుండగానే!

"అనుకున్నా-దిగాడా! వీణ్ణి కొరగానివాణ్ణి చేస్తున్నారు. భయం భక్తి లేకుండా రాత్రులంతా నాటకంలో దాని వొళ్ళో కూచుంటాడు. చాలా మంచి బుద్ధులు!"—

అంటున్నాడు బావ. స్కూలుఫయినల్లో—కాపీచేసి డిబారు ఐన మాబావ!! అంతటితో ఆగక చప్పున ఏదో కోపం వొచ్చింది,

ఆగక, అణగక అతని మొహంలోకి.

"ఈ వెధవ! వీడికి ఆడవాళ్లు. ఆడవాళ్ళా నీకు?"—

అంటో నా ముందరిజుట్టు పట్టుకుని వొంచి గబ గబ నా వీపుమీద గుద్దుతున్నాడు. హడిలిపోయినాను. దెబ్బలకి కాదు. మాబావ యెవడు నన్ను కొట్టడానికి? నాలో యీర్ష్య పని చేస్తోంది గావును, ఎట్లానో నా రాజకుమార్తెని ఏడిపిస్తున్నాడని నాకు తెలీదు అప్పుడు.

అతని చెయ్యి పట్టుకుని పళ్ళతో పీకేశాను. అరిచాను. తరవాత అమ్మ, నాన్న, అక్కయ్య, గోల! ఏం అర్థంకాదు— అల్లుడు ఎందుకు కొట్టేడు వాళ్ళ అబ్బాయిని! అతని చదువుమీద శ్రద్ధ ఎందుకు ఈనాడు అతాత్తుగా! వాళ్ళ అబ్బాయికి బావని కొరికేటంత కసి ఏమిటి అని!

ఆ సాయంత్రం—

"ఏం చదవటంలేదా?" అన్నారు నాన్నగారు.

"ఏం చదువు? ప్రతిరాత్రీ ఎట్లాగో—ఓలాగు నాటకానికి హాజరు. అవే పాటలు, అదే ధ్యాస. పాఠాలకన్న నాటకాలు బాగా వొచ్చు ఈయనకి." అంది అమ్మ.

ఎంత బుద్ధిహీనులు పెద్దవాళ్ళు! చదువుతో నా కింకేంపని!

"ఒరేయ్! ఈనాటినించి నాటకానికి వెళ్ళావంటే వీపు వొలుస్తాను. ఇంకా ఏదో చదువుతున్నా వనుకున్నాను—"

అని వరండాలోకి వెళ్ళారు నాన్నగారు. నన్ను కోప్పడడం ఆయనకి బావుండదు, పాపం!

"నేను చదువు మానేస్తున్నాను అమ్మా!"

అమ్మకి సరిగా అర్థంకాలేదు. సరిగా పిల్లలు అర్థమైతే అమ్మ లెందుకు అవుతారు?

"చదవకపోతే పరీక్ష తప్పుతావు."

"అదికాదు. ఇంక బడికి పోను. నేను నాటకాల్లో చేరతాను."

"విన్నారా ? మీవాడు చదువు మానేసి నాటకాల్లో చేర తాట్ట!" అంది అమ్మ నవ్వుతో.

"చేరతాడు, చేరతాడు. వీపు వొలుస్తాను. జాగ్రత్త ఈనాటినుంచి నాటకం పాక దగ్గిర కనపడ్డావా చూడు."

ఇది రాత్రి ఏడింటికి. సత్రానికి వెళ్ళి నాకు జరిగిన ఘోరం ఆమెతో చెప్పుకోడానికైనా వ్యవధి లేదు.

పక్కమీద పడుకున్నానే గాని నిద్ర రాదు. నాటకం ప్రారంభమయింది—నా తలలో. ప్రతి పద్యం, పాట, సీను, వరసగా యథాప్రకారం జరుగుతోంది. నాకోసం చూస్తోవుం టుంది. పోనీతే, నాటకాలు చూడ్డానికి వీలులేకపోతే నేం, పగలు సత్రం దగ్గిరికి వెళ్ళి ఆమెని కలుసుకుంటో వుంటాను. ఐనా ఇంక ఎన్నాళ్ళుంటారు?

రాత్రి పన్నెండయింది. అందరూ నిద్రపోతున్నారు. ఒక్క సారి ఆమెని చూడాలనిపించింది. చప్పున ఓసారి చూసివొచ్చి మెదలకండా పడుకుంటే, ఎవరికీ తెలీదు. ఇంక రావడానికి వీలులేదనీ, మాతల్లి తండ్రులు ఎంత బుద్ధిలేనివాళ్లో, నిర్దయులో ఆసంగతీ చెపుతాను.

మెల్లిగాలేచి, నిశ్శబ్దంగా తలుపు తీసుకుని బైటపడ్డాను. పాకదగ్గిరికి ఒక్కపరుగు, చీకటి అంటే అంత భయమై

నేను! మామూలుగానే పాకా, లైట్లూ, నాటకం వుండడం చూసి ఆశ్చర్యం కలిగింది. నేను లేకండా అవన్నీ అట్లానే వుంటాయని, జరుగుతాయని అనుకోలేదు.

తోవలో అంతా ఆమె మొన్న నాకు కృష్ణుడివేషం వెయ్యడం, నన్ను ముద్దుచెయ్యడ, నన్ను తన పమిటికింద కాపాడడం, అన్నీ జ్ఞాపకం వొచ్చాయి! నేను ఆమెని చూడాలనడం కన్న, నన్ను చూడకండా ఆమె ఏమౌతోందనేదే నా బాధ.

ప్రేమకి గొప్పలక్షణం అది—అవునంటారా? ఎవరి మధ్య వొచ్చింది ఆ ప్రేమ అని, ఆ మనుషుల అల్పత్వం ఆలోచించకండి. కాని ఒకప్పుడు అంత గొప్పప్రేమ నిజంగా వెలిగింది—నా హృదయంలో! ఎవరిమీదైతేనేం?

నిజంగా ఆమె మళ్లీ నాకు కనపడుతుందా! ఆమె నిజంగా. వుందా ఆ వూళ్ళో, నాకు అందుబాటులో, ఇంకా ఆ రోడ్డు తరగదేం, ఇంతదూరమని తెలీదే ఇదివరకు అని నా మనసులో—

నాటకంపాక నడిచిప్పన వేళ్ళాడే చంద్రవంకనైనా చూడలేదు. సరాసరి తెరవెనకాలకి వెళ్ళాను. ఆ స్టేజీమీద ఆమెలేదు. అవును వుండదు. ఆ సమయానికి ఆ రంగమే జరుగుతోంది. ఆ రంగంలో ఆమెకి పని లేదు. శత్రువుల కుట్ర ఆలోచన సీను అది. ఆమె తెరల వెనకా లేదు!

ఏమయింది? నాకోసం వెతుక్కుంటో వెళ్ళలేదు కద! ఎవరి నడగడానికీ బిడియపడి నుంచున్నాను. ఆమె నాదీ. ఆమెను గురించి ఇంకోళ్ళ నడగడమేమిటి? వొస్తుంది వొచ్చే రంగానికి.

కాని....అసలు రాలేదేమో! జబ్బుపడిందేమో! సత్రంలో వొంటరిగా బాధపడుతోందేమో!

నా చెవిని మాటలు వినపడ్డాయి. పాక వెనక కొంచెం పక్కగా నాయుసు తాటాకులు కట్టిన దొడ్డి వుంది. అదంతా మురికి. అక్కణ్ణించి మాటలు—

"గోలపెడుతోంది," అని మొగకంఠం.

"నేనివ్వను. నా కిచ్చారు మీరు గొలుసు!" అని నా రాజకుమారి.

"ఆ చీరె వుంచుకోవే. కాని గాజు లియ్యి."

"ఇవ్వాలా! హాయిగా ఇస్తాన్లా... "

—పెద్దబూతు. ఆమె నోటినించి!

కదలలేను! వినలేను!

"ఇందండి మీ భార్యగారి మహా ఆభరణం. రెండుకాసుల ఎత్తు లేదు. ఈ రాత్రి నా వెంట రండి చెపుతాను! పోలీసులకి పప్పగిస్తాను."

అంటో చూకుడుగా నా రాజకుమారుడు లోపలికి వొచ్చాడు, ఎఱ్ఱని పెదిమలు, చమ్కీకోటు, కత్తి, మీసాలు —అన్నీ!

నన్ను చూసి హడిలిపోయింది ఆమె. ఆమె మాట్లాడక ముందే, ఆమెవెనకాలే ఆ పురుషుడు వొచ్చాడు—మా బావ.

"ఇదుగో, చూడు...." అంటో, నన్ను చూడక ఆమె బుజంమీద చెయ్యేశాడు. ఆమె విదిలించుకుంది.

"ఒక్కమాట విను."

అంటో నన్ను చూశాడు.

"వెధవా! నిన్ను-నాటకాలకి వెళ్ళవద్దనలేదూ మామ గారు?"

అని కోపంగా పట్టుకుని పూయించి నన్ను తలమీద కొట్టి బైటికి తోసేశాడు.

ఎట్లా వెళ్ళిపడ్డానో ఇంటికి! రక్తం వుడికిపోతోంది-మా బావమీద కసితో. పనిపట్టి నన్నామె ముందు అవమానంచేశాడు.

పాపం నన్ను రక్షించుకోవాలని ఏం తాపత్రయపడ్డది? ఏం చెయ్యను ఈ బావని? రాత్రి పడుకున్నప్పుడు నరికేస్తే! పప్పన్నం తిని, అహింసాబోధనలకి అలవాటుపడి, ఆ అలవాట్లు పోయినాయి గాని, ఇంకో పరిస్థితులలోనే వుడితే అతన్ని ఆ రాత్రి చంపేస్తును. ఏదో గర్వపడతాంగాని చాలా శాంతిస్వభావులమని—అది వుత్త అశక్తత, భయం, పాపభీతి పడేబాధ, కసి, క్రోధం, అన్నీ లోపల లోపల అనుభవిస్తాము. తీర్చుకునే శక్తి, బైటశక్తే కాదు, ఆత్మశక్తీ పోయి నిర్జీవమైనాము. ఈ నీరసానికి, భీరుత్వానికి సహనమనీ, క్షమార్పణ అనీ, ఆధ్యాత్మిక విశాలత్వమనీ గొప్పపేర్లు పెట్టుకు బతుకుతాము!

కసేకాదు, మా బావమీద చాలా కఠినమైన యీర్ష్య కాల్చింది నన్ను. ఆ రాత్రి చేదైన ఆ యీర్ష్యలో మేలుకుంది, నా మొదటి యవ్వనం—అదృష్టవంతులకి గొప్పప్రేమలో, శృంగారంలో, పువ్వుల్లో, వెన్నెలల్లో సార్థకమౌతుంది—ఆ ప్రథమ ఉద్భూతం, రాత్రులు బలంగా మౌనంగా శాంతంగా మూలమూల నించి నన్నని లేతవేళ్ళలోంచి ఘూసారం పీల్చుకునే చెట్ల ఆకలిలో నిలిచి, నక్షత్రాలమధ్య నిశ్శబ్దంలో విహరించే ప్రేమ

కాంతులవరకు లోకాన్ని నింపగల యవ్వనం — బాల్యతనపు ఆశలన్నిటికీ అర్థమైన మొదటి యవ్వనం. కాని ఏ పరిస్థితు ల్లోనో ఓ పరిస్థితులలో యవ్వనం మేలుకోడమనేది: జరిగింది నాకు. మామూలుగా యే రహస్య అంధకారపు ఏకాకిత్వపు నేరభావం లోనో, ఏ అసహ్య బలవంతపు వ్యభిచారంలోనో, లేక అన్ని టికన్న హేయం, బ్రాహ్మలు పగలంతా ఆశీర్వదించి, రాత్రి ముత్తయిదుల చొంగకులుకుల తరవాత ధర్మపత్ని చీదర సమా గమనంలో, మందుచేసి చిచ్చుబుడ్డీ మల్లే ఆరిపోలేదు! నా యవ్వనం తగలపెడితేనేం నన్ను! వెయ్యి భయంకర జ్వాలల్లో హృదయాన్ని మండించింది!

కాన నా మొదటి యవ్వనం-ప్రతి పువ్వులోనూ— అప్సరస లోకాల్ని, గాలిలో శృంగార సందేశాల్ని, ప్రతి స్త్రీలో దేవత్వాన్ని చూపే నవ్యయవ్వనం, కారణం లేకుండానే ఆనందతరంగాల్ని వెదవిమ్మే చిన్ననాటి యవ్వనం — తానెన్నడూ వృథాకాననీ, భవిష్యత్తులో గొప్ప సుందరవిధానాల సాఫల్యం కాబోతున్నానని అంధవిశ్వాసంతో వుయ్యాల లూగే యవ్వనం — ఆనాటి రాత్రి నా తొడలలోంచి, రొమ్ములోకి, రొమ్ములోనించి తలలోకి పైను మల్లే జ్వలించి ఉద్దీపించిన యవ్వనం—పసిపిల్లల నిష్కారణమైన నవ్వులో, అరుపులోనూ, యవ్వనుల్లో మెరసే చూపుల్లో, రొమ్ము విరుపులో, కనపడే ఆనందం!

ఇంక జీవితం— ఎప్పుడూ ఎంత వెతికినా దొరకని ఆ సహజ ఆనందస్థితి కోసమే కద యోగులు అంత తపస్సు! అంత సాధన!

కాని మొదటిరోజుల్లో యవ్వనం, బాల్యంతో దోబూచు లాడుతుంది.

నిద్రపోయినాను, చింతలేకండా, చాలవరకు మరిచిపోయి మేలుకున్నాను.

వాడిలిపోయింది నా మోహమంతా. జీవితంలో రసం పిండేసినట్టయింది. నా పుస్తకాలూ నేను మిగిలాము. నాటకం దప్పులు విన్నప్పుడల్లా ఏదో గొప్ప సంగతిని, నేను ప్రేమించే తల్లి చచ్చిపోయినట్టు వెలితి. ఎందు కట్లా ఐనానని యోచన రాలేదు. ఆ వయసులో యోచించం.

ఆమేమి చేసింది? నే నామెని ఏమనుకున్నాను? అంటే నే నేమీ అనుకోలేదు. కాని ఆరాత్రి చూసిన సంగతివల్ల నా కామె నించి సంపూర్ణంగా ఆమెమీద పూర్తి విరక్తి కలిగింది!

అంతేకాదు. కొందరు మొగవాళ్ళు వుంటారు....మన ప్రియురాలు తనని మించి వ్యవహారాలు పెట్టుకుందన్నా సహింపగలము కాని—ఆ మొగవాళ్లు ఓ స్త్రీని తాకారని మనకి తెలిస్తే ఆ స్త్రీని యింక తాకలేము. ఎక్కిన విషయాల్లో చాలా సన్నిహితులై ప్రేమాస్పదులైన వాళ్లే. కాని వాళ్ళని స్త్రీపరంగా భరించలేము. వాళ్ళు స్పృశించారని తెలిస్తే, ఇంక ఆ స్త్రీ మలినమై పోతుంది. అట్లాంటివాళ్ళలో, ఆ చిన్ననాటి మా బావ ముఖ్యుడు. కార్యమయింతరవాత మా అక్కని దూరంగాకూడా భరించలేక పొయ్యేవాణ్ని. అతనికి సేవచెయ్యడం, అతని గదిలోంచి బైటికి రావడం చూడకుండా తప్పించుకునేవాణ్ణి. నా రాజకుమార్తె ఇంకేంచేసినా, నన్ను నవ్వినా, పొమ్మన్నా, అవమానం చేసినా

నా మమత విడిపొయ్యేది కాదు. కాని మా బావ అధికార....నా. హృదయాన్ని ఏ విధంగా ఏ ఆయుధంతో హత్యచెయ్యాలో సరిగా తెలుసుకుని చీల్చినట్టయింది. ఆమెమీద కోపం, అస హ్యం, తిరగబాటు—అన్నిటితో బాధపడ్డాను. నా ప్రేమ పోలేదు. గాఢంగా గాయపడి గిలగిలలాడింది—

కాని యవ్వనం— దెబ్బ తిన్న బంతిలాగు ఎగురుతుంది· మామూలు పాఠాలలో. ఆటలలో పడ్డాను. వారం రోజుల్లో, రాత్రి పడుకున్నప్పుడు మాత్రం పెద్ద శూన్యం తట్టేది. కాని నిద్ర. అదృష్టవంతమైన రోజులు. స్త్రీస్వభావంమీద కట్టుకున్న ద్వేషం, వైరాగ్యం, వేదాంతం, సినిసిజం, ఇవేం అవసరంలేదు, చిన్న తనంలో మళ్లీ జీవితాన్ని కట్టుకునేందుకు.

ఈ లోపల బావకీ అక్కయ్యకీ ఘర్షణలు వికృతమవుతున్న సంగతి గమనించలేదు నేను. ఎందుకంటే మా బావ మొహం చూడడమే అసహ్యం. ఇంటిదగ్గిరే వుండటం లేదు నేను! ఆతనికి ఎదురుపడాల్సివొస్తుందని!

ఓ నాడు రాత్రి పదింటికి చదువుకుంటున్న నా దగ్గిరికి మా అక్కయ్య వొచ్చి నా బుజంమీద ప్రేమగా చెయ్యివేసి నుంచుంది.

"తమ్ముడూ, నా కో సహాయం చేసిపెట్టాలి—"

గొంతు చాలా తగ్గించి మాట్లాడుతోంది.

"చూడు. నాటకాల కంపెనీవాళ్ళు వెళ్ళిపోతున్నారు ఈ వూరినించి. నా చీరె ఆ రత్తిదగ్గర వుండిపోయింది. దాన్నడిగి తెచ్చిపెట్టాలి."

నా తలలో పది సంగతులు ఒక దానితో ఒకటి పెనవేసు కొని పొంగడంతో ఏమీ మాట్లాడలేకపోయినాను.

వెళ్ళిపోతున్నారు. ఇంక రాజకుమార్తె కనపడదు.

ఛీ-దాని సంగతి అసహ్యం. పోనీ-

అక్కయ్య చీరె!

అక్కయ్య నన్నడుగుతోంది.

ఎట్లా వెళ్ళి మళ్ళీ ఆమెమొహం చూడను?

కాని ఈ వంకతో మళ్ళీ ఓసారి ఆమెనిచూడగల అదృష్టం.

ఛా. చూడకూడదు.

ఏమని అడగను?

"నీ చీరె ఎందు కుంది ఆమె దగ్గిర?" అన్నాను.

"నేనే ఇచ్చాను, ఎరువుగా."

"కబురంపూ."

"కాదు. నువ్వే అడుగు."

"నేను వెళ్ళను."

"ఎందుకు వెళ్ళవు? ఎప్పుడూ వేళ్లేవాడివిగా—"

"వెళ్ళవొద్దన్నారుగా!"

"నువ్వడిగితే ఇస్తుంది."

"ఎందు కియ్యదు? ఎరువు తీసుకుంది? నేనెందుకు? నాకు సైంలేదు."

"తమ్ముడూ. వెళ్ళరా. చాలా ఖరీదురా అది! వృధాగా పోతుంది."

"బావ నడగమను."

"ఆయన వెళ్ళరుట."

"నేనూ వెళ్ళను."

అక్కయ్య కళ్ళల్లో నీళ్లు—

"సరేలే. ఒకవేళ ఇయ్యకపోతే!"

"నువ్వడిగితే ఇస్తుంది. నాకు తెలుసు;"

"ఎట్లా తెలుసు?"

అనుమానంగా "మీ బావ చెప్పారు!"

"ఊఁ—మరి నీ గొలుసు వొచ్చిందా?"

అనేశాను ఆలోచించకుండా. తెల్లబోయింది అక్కయ్య.

"గొలుసేమిట్రా?"

"ఏం లేదులే."

"చెప్పు—నీ కెట్లా తెలుసు?"

"నాకు తెలీదు. ఎందుకో అన్నాను. సరే, వెడతానన్నానుగా!" అని లేచిపోయినాను అక్కణ్ణించి.

పొద్దున్నే సత్రానికి వెళ్ళాను! వాళ్లు రైలుకు వెళ్లారుట. తొరతొరగా స్టేషన్‌కి వెళ్లాను. చాలా టైముంది. సామాన్లు లగ్గేజి చేయిస్తున్నారు.

అంపరూ నన్ను చూసి "వొచ్చాడు, వొచ్చాడు" అన్నారు. రైలుపట్టాలకేసి దూరంగా నుంచున్న ఆమె తలెత్తింది. కళ్ళలో నీళ్లు వున్నాయి అనుకున్నాను. నావంక చూస్తోనే గుర్తుపట్టకుండా నుంచుంది, కొంచెంసేపు ఆలోచనల్లో బైటికిరాకుండా. ఎక్కడో ఆలోచిస్తూనే దగ్గిరికి వొచ్చి నా బుజంమీద చెయ్యి వేసి నా వంక చూస్తూ నుంచుంది. ఆ చేత్తోనే ప్లాట్‌ఫారం చివరికి నడిచింది నన్ను తీసుకుని. గంగరావిచెట్టుకింద నుంచున్నాము.

ఆ ఉదయాన—

ఆమె మీద కోపం, యీర్ష్య, అసహ్యం అన్నీ ఏమూలా లేవు నాలో. నేను అన్నాళ్ళు ఎందుకు రాలేదు ఈమె దగ్గిరికి? పదిరోజులు గొప్పకాలం వృధాచేసుకున్నాను. కొందరు మిత్రులసంగతికూడా అంతే. వాళ్ళ నిర్లక్ష్యం, మనమీద మరుపు, చివరికి అపకారం, అన్నీ మరుస్తాము వాళ్ళని చూడగానే; అవి మరి వాళ్ళ శక్తో, మన గొప్ప ప్రేమో లేక వాళ్ళు చేసిన పనులు వాళ్ళని అంటవో!

ఆమె మాట్లాడలేదు. లోపలలోపల ఏమో అవుతోంది.

మెల్లిగా నాతల, చంపలు నిమిరి వొకటే ఏడ్చింది.

ఆకాశాన యీదురుగాలిలో మబ్బులు పరుగెత్తుతున్నాయి. చెట్లు మా వేపు వొరిగి పోతోంది గాలి బరువుని భరించలేక. ఆమె జుట్టు, పమిట అన్నీ ఎగిరిపోతున్నాయి. ఆమె నిస్సహాయంగా నన్ను తాకుతో, 'నేను' అనే నన్ను లోపలికి తీసుకుంటో నుంచుంది, ఎంత సేపో. ఎండ మీదపడి, మళ్ళీ మబ్బుచాటున. మామీద నీడ పడుతోంది. అన్నీ మరచి ఆమె దయలో నిలిచి పోయినాను.

గాలికి ఆ పిట్టల యీకలన్నీ రేగుతున్నట్టే, పాపం జీవితపు తుపానులు ఏంచేశాయో ఆమెని అనుకుంటాను ఇప్పుడు.

రైలుకి గంట!

గొప్ప ఉద్రేకంతో, ఆవేశంలో వెక్కి వెక్కి ఏడుస్తో, నన్ను కావిలించుకుంది, నా తలని తన రొమ్ముకి అదుముకుంటో!

ఏడుస్తోనే "వెళ్ళిపోతున్నాను"

అని తిరిగింది స్టేషన్ వేపు. నా బుజంమీద చెయ్యి తియ్య

కండానే, పొంగివచ్చే కన్నీళ్ళని చెరగుతో తుడుచుకుంటో. ఏమను కున్నారో మనుషులు-ఆనాడు ఇంకా ఆ ధ్యాసవుండదు చిన్నవాళ్లకి.

ఎట్లా వోదార్చను! ఎందుకు ఏడుస్తుంది? ఏ విధంగా, ఏం మాట్లాడి సంతోషాన్నివ్వను ఆమెకి? అనేదే ధ్యాస.

నా మీద ఎంతో ప్రేమ ఈమెకి. ఈమెని వొదిలి తిరగాను, అందుకు ఏడుస్తోంది, అనుకున్నాను.

అంతే తెలుసుకోగలను ఆనాడు.

ఆమె మాట్లాడితే, ఏమన్నా చెప్పగలిగేవాణ్ణేమో!

మా అక్కయ్యా, చీరా చాలా దూరం నా మనసునించి. స్టేషన్‌ముందుకు వొచ్చాక, పెద్ద అలమల్లే వొచ్చే ఏడుపుని లోపలికి కుక్కుకుంటో, ఆ రైలు వొచ్చే చప్పుళ్లో "ఇంక వెళ్లు." అంది.

వెళ్ళిపోయినాను బైటకి. నే నెక్కి వొచ్చిన సైకిలు చూసేప్పటికి జ్ఞాపకంవొచ్చింది, నేను వొచ్చిన పని.

గబగబ లోపలికి వెళ్లాను. ఆమె ప్రశ్నార్ధకంగా చూసి నవ్వింది. 'చివరిదాకా నన్ను విడపలేదు' అన్నట్టు.

నాకు తెలుసు మా బాప ఆ చీరె ఆమె కిచ్చాదనీ, ఆమె ఇవ్వదనీ. కాని అక్కయ్య అడగమంది.

ఇంక వెళ్ళిపోతుంది ఆమె—

కలకాలం వుండేది అక్క.

చీరె ఇవ్వదు. కాని ఎట్లా వెళ్ళను ఇంటికి. అడగకండా.

అంతేకాదు. ఆమె రాజకుమార్తె కావొచ్చు, నామీద ప్రేమే కావొచ్చు. కాని వెళ్ళిపొయ్యే ఆమె, నా అక్క చీరెని—

మా ఆస్తిని తీసుకువెళ్ళడానికి వీల్లేవనేది పనిచేస్తోందనుకుం టాను-నాలో. ప్రేమలో కళ్లు కప్పి ఇచ్చేస్తారు మొగాళ్లు. వేలివ్వ వొచ్చు. కాని ప్రియురాలు తాము ఇయ్యనిదాన్ని తీసుకుందంటే భరించలేరు.

అక్క——నా కుటుంబానికి, నా వంశానికి, నా గౌరవానికి నా జీవితానికి పెనవేసుకున్న అక్క! అక్క వొంటిని, ఘనానాని, పాతివ్రత్యాన్ని పెనవేసుకుంది చీరె.

అక్కమీద ఎంత నాకు ద్వేషముండనీ. నా అక్కతో నా అక్క చీరెతో ఆమె సమాన మెట్లా అవుతుంది?

ఆమెకీ నాకూ మధ్య వుత్త అర్థంలేని, అవసరంలేని, వుత్త ప్రేమ.

"అక్కయ్యా చీరె తీసుకురమ్మంది."

ఆ మాట అర్థంకానట్లు చూసింది.

మాటలేకండా, మెల్లిగా తన ట్రంకు తెరిచి, పైనవున్న చీరెని, నావంక చూడకండానే నా చేతికి అందిచ్చి పెట్టెతాళం వేసి, నావంక చూడకండానే రైలువేపు వెళ్ళిపోయింది.

అని కథని ఆపాడు తాసిల్దారు.

* * * *

సముద్రం పొంగి క్లబ్బుని మింగెయ్యడానికిలాగు దొర్లు తోంది వాళ్ళవేపు ఉద్రేకంగా.

"చిత్రంగానేవుంది. ఎంత కుర్రవాడివైనా, అట్లాంటి స్త్రీని అంతకాలం-నిజం కనపడుతున్నాకూడా, కళ్ళు మూసుకుని ఆరా ధించడం" అన్నాడు లింగరాజు.

"ఏమిటో: ఇప్పుడు యోచిస్తే ఏమనిపిస్తుందంటే-ఆమెది గొప్ప హృదయమని. ఆమె ఆకారం కాదు, అలవాట్లు కాదు, ఆమెకి నాపైన కలిగిన గొప్పప్రేమ నన్నంత వశ్యుణ్ణి చేసుకుంది. పైగా కొద్దో గొప్పో, ఆ వయసున నన్ను ఆకర్షించగలిగిన ఆర్టిస్టు."

"మీ బావ?"

"అతని బావసంగతి చాలా స్పష్టం. అట్లాంటివాళ్ళని రోజూ చూస్తూనేవుంటాము." అన్నాడు శానిటరీ.

"పోనీ, ఆమెకి నీమీద ఎందు కా ఇష్టం అంటావు?"

"దాన్నే నేను గొప్ప హృదయమంటాను. ఈ ప్రేమనే ఐశ్వర్యవంతులకీ, రాజకుమారులకీ, లేక జానపదులకీ కర్షకులకీ అంటకడితే ఏ కథకుడో, మీకు చాలా సహజంగా అందంగా కనపడుతుంది. లేని అందాలుకూడా కల్పించుకుంటారు సులభంగా. కాని మామూలు మట్టి స్త్రీకి, నాలుగు డబ్బులకి తనని అమ్ముకునే స్త్రీలో, ఏ అవసరమూ, ఆశా లేని ప్రేమ వుందంటే నమ్మడం కష్టం. మనం జీవితసూత్రాల కింద, మన ఆధిక్యతా భావంకోసం నిజమని నమ్ముతున్న విలవలు తారుమారౌతాయి."

"మరి ఇంతకీ మనలింగరాజు కొడుకు సంగతేమంటావు?"

"ఏమంటాడు? కులటల్లోనే నిజమైన ప్రేమ వుంటుంది, అందులోంచి ముఖ్యంగా నాటకాలవాళ్ళల్లో, సినిమా స్త్రీలలో తప్పకండా ఆశీర్వదించి పెళ్ళి చెయ్యమంటాడు."

"నీ కొడుకు చేసుకుంటానన్నా అంతేనా?" అని దిక్కరించాడు తాసిల్దారుని.

"ఒప్పుకోను. ఎందుకంటే నిజమైన ప్రేమ కాపరానికి ఏం అవసరం? విద్యుల్లత పడకగదుల్ని వెలిగిస్తుందా? కిరసనాయిలు బుడ్డే కావాలి ఆ పనికి. ఒక సంగతి చాలా స్పష్టం నాకు. స్త్రీలో గొప్ప ప్రేమ కలిగినా సరే, ఎన్నడూ తనని ప్రేమించిన పురుషుడి జీవితాన్ని ఆ ప్రేమ మూలంగా నాశనం చెయ్యడానికి ఒప్పుకోదు——ఆ పురుషుడు కూడా ఆ ప్రేమే ముఖ్యమై, తక్కిన నాశనాలకి సంసిద్ధుడైతే తప్ప!"

